ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 178 మంగళవారం 16 - 06 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 178 Tuesday 16 - 06 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు
- కిషన్‌రెడ్డి వల్లే మెట్రో సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బందులు
- హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే మెట్రో రైలు నిర్మాణం
- రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 15:

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే ఆలోచనతో గతంలో దేశంలోనే కీలకమైన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం గురించి చర్చ జరిగిందని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందుగా ఉన్నాయని పేర్కొన్నారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, - మిగతా 2 లో

# హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక



- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సాలార్‌జంగ్ మ్యూజియంకు 75 ఏళ్లు
- మ్యూజియం 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, డిప్యూటీ సీఎం
- మ్యూజియం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్న భట్టి విక్రమార్క
- ఈ నెల 21 వరకు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణ

వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 15:

హైదరాబాద్ నగర స్ఫూర్తికి, సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మ్యూజియం 75వ వార్షికోత్సవం, సాలార్‌జంగ్3, 137వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విభిన్న సంస్కృతులు, - మిగతా 2 లో



## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

- విద్యార్థులకు సీఎం రేవంత్ సందేశం
- వేసవి సెలవుల అనంతరం తెలంగాణలో పాఠశాలలు పునఃప్రారంభం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్కార్
- వారంలో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి మాల్ట్ పంపిణీ
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సందేశం
- రాష్ట్రవ్యాప్తంగా 1,269 పాఠశాలల్లో 1.44 లక్షల మందికి ప్రయోజనం

వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 15:

వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల - మిగతా 2 లో

# తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం

- ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యమెందుకని ప్రశ్న
- రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందన్న పవన్ కల్యాణ్
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం జనసేన పనిచేస్తుందన్న పవన్




వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 15:

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని - మిగతా 2 లో

# కేజీబీవీ బాలికల మధ్య డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు



- రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభం
- మొయినాబాద్ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన భట్టి, మంత్రి పొన్నం

మొయినాబాద్, జూన్ 15 (వార్త సంధ్య) :

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య అత్యంత నిరాడంబరంగా జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం ను సోమవారం సందర్శించిన ఆయన, విద్యార్థినులతో కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్పొరేట్ హంగులు, ఆర్భాటాలకు దూరంగా బాలికల మధ్య బర్త్‌డే జరుపుకోవడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఉపముఖ్యమంత్రి విద్యార్థినుల మధ్య కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యత, వసతి సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద: భట్టి

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు - మిగతా 2 లో

# 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

- బ్రిటన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం
- 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం విధించిన యూకే
- పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రతే లక్ష్యమన్న ప్రధాని కీర్ స్టార్మర్
- టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ సహా ప్రధాన ప్లాట్‌ఫామ్‌లకు వర్తించనున్న నిబంధనలు
- నిర్ణయాన్ని స్వాగతించిన స్వచ్ఛంద సంస్థలు - మిగతా 2 లో

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు

# అభిజీత్ దీప్కేపై దాడి


- 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై జైపూర్‌లో దాడి
- నీట్ లీక్, నిరుద్యోగంపై నిరసన తెలుపుతుండగా ఘటన
- కేంద్ర మంత్రి రాజీనామా డిమాండ్‌తో ఆందోళన
- అభిజీత్‌పై మూకదాడికి సంబంధించిన వీడియోలు వైరల్
- యువతలో ఈ పార్టీకి ఆన్‌లైన్‌లో భారీ మద్దతు



వార్త సంధ్య, జైపూర్ , జూన్ 15 :

యువతలో ఆన్‌లైన్‌లో సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ - మిగతా 2 లో

# ఏపీ ప్రభుత్వంతో గూగుల్ జట్టు



- ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు నిర్ణయం
- గూగుల్‌తో కలిసి పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో భాగస్వామ్యానికి అంగీకారం
- లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులపై వైసీహెచ్ గ్రూప్‌తో చర్చలు
- ఏపీలో యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సీఎం ప్రతిపాదన

వార్త సంధ్య, అమరావతి, జూన్ 15 :

ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతతో పాటు ఇతర కీలక రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, టెక్ దిగ్గజం గూగుల్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా ఇరుపక్షాల సమన్వయంతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నాడు గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి అంశాలలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరువురు నేతలు ప్రాథమిక అంగీకారానికి వచ్చారు.ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ మరియు డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని గూగుల్ ప్రతినిధులకు సీఎం విజ్ఞప్తి - మిగతా 2 లో



## విజయవాడ ట్రాఫిక్ సిగ్నళ్లకు ఏఐ టెక్నాలజీ


- వెబ్, మొబైల్ ద్వారా నియంత్రణకు ఏర్పాట్లు
- నగరంలో పైలెట్ ప్రాజెక్టుకు మంచి స్పందన
- మొబైల్ నుంచే ట్రాఫిక్ సిగ్నల్ నియంత్రణ
- 17 కూడళ్లలో మొబైల్‌తో నియంత్రణ

వార్త సంధ్య, అమరావతి, జూన్ 15 :

విజయవాడ నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ట్రాఫిక్ పోలీసులు ఏఐ ఆధారిత సిగ్నల్ కంట్రోలర్లను ఏర్పాటు చేయనున్నారు. వెబ్ లేదా మొబైల్ యాప్ ద్వారా సిగ్నల్ లైట్లను నియంత్రించే ఈ వ్యవస్థను గత నెలలో రమేష్ ఆసుపత్రి కూడలిలో ప్రయోగాత్మకంగా అమలు చేయగా ఆశించిన ఫలితాలు లభించాయి. దీంతో నగరంలోని ఇతర కీలక కూడళ్లలో కూడా ఈ పరికరాలను నెలాఖరులోగా - మిగతా 2 లో

# వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ విధానం
- స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో నిర్వహించిన భేటీలో పాల్గొన్న సీఎం
- భూ సమీకరణ విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామని వివరించిన చంద్రబాబు
- భారత్ అతి పెద్ద ఆర్థికశక్తి అని స్పష్టం



వార్త సంధ్య, అమరావతి, జూన్ 15 :

స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సమావేశానికి సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు. ఇప్పుడు భారత్ నిద్రపోతున్న ప్రాంతం కాదు. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి అని సీఎం స్పష్టం చేశారు.ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందన్న సీఎం వివరించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆక్రమిత కశ్మీర్ కల్లోలం

ఎప్పుడూ జమ్మూ, కశ్మీర్ గురించి అంతర్జాతీయ వేదికలపై గంభీరోపన్యాసాలిస్తూ, మానవ హక్కుల చాంపియన్‌గా తనను తాను చిత్రించుకునే పాకిస్తాన్ గత కొన్ని రోజులుగా ఆక్రమిత కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం సైన్యం కాల్పుల్లో 30 మంది మరణించారంటున్నా, వాస్తవ సంఖ్య అంతకుమించి ఉంటుందన్నది స్థానికులు చెప్పే మాట. మరో 200 మంది గాయపడ్డారు. వేలాదిమంది అరెస్టయ్యారు. ఈసారి సాగిన నిరసన ప్రదర్శన సాధారణమైంది కాదు. ముజఫరాబాద్ ప్రదర్శనలో అన్నివర్గాలకూ చెందిన లక్షన్నరమంది పాల్గొన్నారు.మతం పేరు చెప్పి, గతం పేరుచెప్పి ఎల్లకాలమూ జనాన్ని మభ్యపెట్టడం సాధ్యంకాదని పాక్ పాలకులకు ఈ నిరసనలు తెలియజెప్పాయి. తమ ప్రాంత నదుల్లో మంగళ డ్యామ్‌వంటి ప్రాజెక్టులు నిర్మించి,ఇక్కడ ఉత్పత్తయ్యే జలవిద్యుత్‌ను పంజాబ్ తదితర ప్రాంతాలకు తరలించుకుపోతూ, స్థానికులకు అరకొర సదుపాయాలు కల్పించటం విషయంలో రెండు దశాబ్దాల క్రితమే అసంతృప్తి పెల్లుబికింది. కానీ సంఘటితం కాకపోవటంవల్ల చల్లారిపోయాయి. 2023లో రావల్‌కోట్, ముజఫరాబాద్, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో స్థానిక సమస్యలపై కమిటీలు ఏర్పడి ఉద్యమించాయి. ప్రజల మౌలికాహారమైన గోధుమ పిండి ధర పెంచడాన్నిప్రశ్నించాయి. వీటిని ప్రభుత్వం బేఖాతరు చేసిన ఫలితంగా ఆ కమిటీ లు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జాక్)గా ఒక్కటయ్యాయి.ఆనకట్టల కారణంగా పలువురు నిర్వాసితులవుతున్నా, వలసపోతున్నా పట్టించు కునేవారు లేరు. పోనీ అని స్థానిక ప్రజలకైనా ఒరిగేదేమీ ఉండదు. మిలిటెన్సీ ఉందన్న పేరిట భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించటం ఒక్కటే వారికి కనబడేది. అందుకేశాంతియుత పద్ధతుల్లో పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహించటం, విద్యుత్ బిల్లుల చెల్లింపు నిలిపివేయటం, సంపూర్ణ బంద్, లాంగ్‌మార్చ్ వంటివి ఈ మూడేళ్లలో ఎన్నో జరిగాయి. సైన్యం పడగనీడలో కాలక్షేపం చేసే ప్రభుత్వానికుండే అధికారాలు అంతంత మాత్రం. ఏ జవాబుదారీతనమూ లేని సైన్యానిదే పెత్తనం. అందుకే ఆక్రమిత కశ్మీర్‌కు ఎదుగూ బొదుగూ లేదు. ఆ ప్రాంత వనరుల్ని కొల్లగొట్టడానికి పాక్ పాలకులు ఒక సృజనాత్మక విధానం కనుక్కున్నారు. 53 మందితో దానికొక అసెంబ్లీ ఉంది. ఆక్రమిత కశ్మీర్‌కు ముఖ్యమంత్రి కాదు... ప్రధాని ఉంటాడు. కానీ అధికారాలన్నీ ఇస్లామాబాద్‌లో కొలువుదీరిన సైనికాధికారుల ఆధిపత్యంవుండే కశ్మీర్ కౌన్సిల్ చేతిలో ఉంటాయి. ఈసారి కేవలంఆర్థిక సమస్యలపై మాత్రమే కాదు... అసెంబ్లీ అమరికపై కూడా డిమాండ్లు బయల్దేరాయి. మొత్తం 53 స్థానాలుండగా, 'శరణార్థుల'కు డజను కేటాయిస్తారు. మరో అయిదు మహిళలకూ... ఉలేమాలు, సాంకేతిక నిపుణులు, విదేశాల్లో స్థిరపడిన కశ్మీరీలకు ఒక్కొక్క స్థానం ఉంటాయి. ఈ ఖాతాలకింద పోయే 20 స్థానాలకూ ఎన్నికలు జరిగేదెక్కడో, నిర్వహించేదెవరో ఎవరికీ తెలియదు. వారు ఎన్నుకోవాల్సింది మాత్రం 33 మందిని.మళ్లీ ఇందులో అత్యధికులు పాక్ పాలకుల కనుసన్నల్లో నడిచేవారే ఉంటారు. చివరకు కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఉద్యమకారులు అడిగేదల్లా 'శరణార్థుల' డజను స్థానాలూ రద్దు చేయాలన్నదే. కానీ అలా చేస్తే స్థానికుల పెత్తనం పెరుగుతుందని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే జాక్ నాయకుల ఆచూకీ చెబితే 35,000 డాలర్లు బహుమతి ఇస్తామని ప్రకటించింది. వచ్చే నెల్లో ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ప్రాంత వనరుల దోపిడీ తప్ప, వారి ఆకాంక్షల్ని నెరవేర్చడం సాధ్యపడదని ఉద్యమాలను అణిచేయటం ద్వారా పాక్ చెబుతోంది. పాలకులు వలసవాద మనస్తత్వంతో ఆప్రాంతాన్ని చెరబట్టారు తప్ప, స్థానికుల డిమాండ్లపై ఖాతరు లేదు. ఉద్యమకారులు38 కోర్కెలు ప్రభుత్వం ముందుంచారు. డజను సీట్ల కోటా రద్దుతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయనాయకులకిస్తున్న ఖరీదైన కార్లు, ఉచిత విద్యుత్ తదితర రాయితీలు రద్దు చేసి, ఆ నిధులు జన సంక్షేమానికి వ్యయం చేయాలని కూడావారు కోరుతున్నారు. ఇలాగే మొండికేస్తూ పోతే ఆ ప్రాంత ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుందే తప్ప చల్లారదని పాకిస్తాన్ పాలకులు గ్రహించాలి.

# ఏపీ ప్రభుత్వంతో గూగుల్ జట్టు

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగానికి, 'సంజీవని' ప్రాజెక్టు అమలుకు సాంకేతిక భాగస్వామ్యం కావాలని కోరారు. అదేవిధంగా, రాష్ట్ర యువతకు ఏఐ, క్లౌడ్ టెక్నాలజీ రంగాలలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని చంద్రబాబు ఈ సందర్భంగా ప్రతిపాదించారు.తన పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి లాజిస్టిక్స్ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ అయి, రాష్ట్రంలో సప్లై చైన్ మరియు లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరరేఖ, పోర్టులు మరియు మెరుగైన కనెక్టివిటీ వంటి మౌలిక వసతులను వివరిస్తూ పెట్టుబడులకు ఆహ్వానించారు. మరోవైపు, యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తోనూ సమావేశమైన సీఎం, రాష్ట్రంలో 'యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు చొరవ చూపారు. పట్టణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కీలక సమావేశాల్లో ముఖ్యమంత్రితో పాటు మంత్రి నారాయణ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక

**మొదటిపేజీ తరువాయి -** విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సాలార్‌జంగ్ మ్యూజియం వివిధ సంస్కృతుల మధ్య సామరస్యానికి ప్రతీక అని, ఇది ఒక అపురూపమైన జాతీయ సంపద అని అభివర్ణించారు. జూన్ 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా మ్యూజియం విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.సాలార్‌జంగ్-3గా ప్రసిద్ధి చెందిన మీర్ యూసుఫ్ అలీ ఖాన్ ఒక్కరే సేకరించిన అరుదైన కళాఖండాలతో ఈ మ్యూజియం ఏర్పాటైంది. 1951లో మూసీ నది ఒడ్డున ప్రారంభమైన ఈ మ్యూజియం, నేడు దేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం

**మొదటిపేజీ తరువాయి -** పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు.యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## విజయవాడ ట్రాఫిక్ సిగ్నళ్లకు ఏఐ టెక్నాలజీ



**మొదటిపేజీ తరువాయి -** ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు.రమేష్ ఆసుపత్రి కూడలిలో అమలు చేసిన పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో బెంజి సర్కిల్, నిర్మలా జంక్షన్, మహానాడు, చల్లపల్లి బంగ్లా, పోలీసు కంట్రోల్ రూమ్, డీసీపీ బంగ్లా, ఆంజనేయస్వామి కూడలి, చుట్టుగుంట జంక్షన్, విజయా టాకీస్, శారదా కళాశాల కూడలి, సీతారాంపురం, సీతన్నపేట గేట్, పడవలరేవు, అప్సర, ఫుడ్ జంక్షన్, మధురానగర్ వంటి రద్దీ ప్రాంతాల్లో కూడా ఈ వ్యవస్థను విస్తరించనున్నారు.సిగ్నల్ స్తంభాలకు అమర్చే ప్రత్యేక పరికరాలు సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా ఏ సమయంలో ఏ రంగు సిగ్నల్ ఇవ్వాలో నియంత్రించగలుగుతారు. ప్రస్తుతం కొన్ని కూడళ్లలో సమయాలను ముందుగానే సెట్ చేసి సిగ్నళ్లను నిర్వహిస్తుండగా, కొత్త విధానంతో పరిస్థితులకు అనుగుణంగా వెంటనే మార్పులు చేయడం సాధ్యమవుతుంది.భవిష్యత్తులో కూడళ్ల వద్ద అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాహనాల రద్దీని ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కూడా పర్యవేక్షణ ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను క్షణాల్లో గుర్తించి సిగ్నల్ సమయాలను మార్చే అవకాశం ఉంటుంది.ఈ కంట్రోలర్లను భవిష్యత్తులో ఎడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్)తో అనుసంధానించనున్నారు. వాహనాల లెక్కింపు, నంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాల ద్వారా సేకరించే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని సిగ్నళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధానం అమలులోకి రానుంది. అయితే వాహనాల రద్దీని బట్టి సిగ్నళ్లను నియంత్రించడం వల్ల ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లు తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా సిగ్నల్ వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా ఉండటంతో ప్రయాణికుల సమయం ఆదా అవుతుంది. దానితో పాటు ట్రాఫిక్‌లో వాహనాలు నిలిచిపోయే సమయం తగ్గడంతో ఇంధన వినియోగం, వాయు కాలుష్యం తగ్గే అవకాశం ఉంది.

# వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్

**మొదటిపేజీ తరువాయి -** కానీ భారత్‌కు అంత సమయం పట్టటం లేదని అన్నారు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు.భారత్‌ను నెంబర్ 1 చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఏపీలో పెట్టుబడుల విషయంలో ప్రధాని చొరవ కారణంగా ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీకి వచ్చాయని వివరించారు. హిందూ గ్రోత్ రేట్ 1 నుంచి 2 శాతం మాత్రమేఅని ఒకప్పుడు హేళన చేసేవాళ్లు ఇప్పుడు పరిస్థితి మారిందని, ఏ రంగంలో పెట్టుబడులకు అయినా భారతదేశం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పాలసీలు, సాంకేతిక నిపుణులు, అవసరమైన ఎకో సిస్టంతో ప్రధాని దేశాన్ని పెట్టుబడులకు సిద్ధంగా ఉంచారన్నారు. ప్రస్తుతం 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉందని అన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో తాము వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరి స్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామన్నారు. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నామన్నారు. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు కేటాయించామని తెలిపారు. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయమన్న చంద్రబాబు, పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయన్నారు. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందని అన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు."శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశముంది. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.

# కేజీబీవీ బాలికల మధ్య డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు







**మొదటిపేజీ తరువాయి -** నేటి నుంచే అల్పాహార (బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు.ప్రభుత్వ, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన యూనిఫామ్‌లు, షూస్, ఇతర సౌకర్యాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. "ఈనాటి విద్యార్థులే రేపటి మానవ వనరులు, రాష్ట్ర సంపద. వారి విద్య, ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడదు" అని ఆయన అన్నారు.గత పదేళ్లలో డైట్ చార్జీలు పెరగకపోవడం వల్ల విద్యార్థులు పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందని గుర్తు చేశారు. మొయినాబాద్ కస్తూర్బా పాఠశాలకు అదనపు గదుల అవసరంపై ప్రతిపాదనలు పంపితే ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

**బాలికల విద్య కోసం కేజీబీవీల ఏర్పాటు**

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కేజీబీవీలను ఏర్పాటు చేశారని భట్టి గుర్తు చేశారు. ఈ పాఠశాలల ద్వారా బాలికల డ్రాపౌట్ శాతం గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం అవి అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు.

**భట్టి నిరాడంబరతకు ఇదే నిదర్శనం: మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హోదాకు తగిన ఆర్భాటాలు లేకుండా పేద బాలికల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆయన నిరాడంబరతకు నిదర్శనమని కొనియాడారు.గత ప్రభుత్వాల కాలంలో పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మోటిక్ బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేసిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అల్పాహార పథకాన్ని ప్రారంభించామని చెప్పారు.

**విద్యార్థినుల నుంచి జన్మదిన శుభాకాంక్షలు**

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు, పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించడంపై విద్యార్థినులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ మధ్య ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు జరుపుకోవడం మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని పేర్కొంటూ భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు భీమ్ భరత్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అధ్యక్షత వహించగా, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి , ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

**మొదటిపేజీ తరువాయి -** ప్రతి ఏడాది రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ ఒప్పుకోలేదని వివరించారు.రూ.30 వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని, ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భాగస్వాములుగా ఉన్నారని, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్‌కు రూ.లక్షా 52 వేల కోట్లు అప్పుగా ఇచ్చారని, గతంలో కేసీఆర్‌కు ఆర్ఈసీ రూ.1.61 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిందని, ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.3.15 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చారని తెలిపారు.ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి 4 శాతం వడ్డీకి రూ.13,600 కోట్ల రుణం ఇప్పించామని సీఎ తెలిపారు. బ్యాంకుల అప్పులకు రేవంత్ రెడ్డికి తేలికగా పనిచేస్తే తెలంగాణలో బీజేపీకి ఇబ్బందులు వస్తాయని కిషన్‌రెడ్డియయ ఖట్టర్, అశ్వినీకి చెప్పారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఖట్టర్, అశ్వినీకి చెప్పాకే సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.గతంలో కిషన్‌రెడ్డిని కేసీఆర్ ఏమని తిట్టారో ప్రజలందరికీ తెలుసునని సీఎం తెలిపారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణ నిధులు ఇంకా ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హామీ ఇచ్చినా కూడా లోన్ డబ్బు ట్రాన్స్‌ఫర్ కాలేదని, ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో ఉన్నది కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా అని నిలదీశారు. కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ కలిసి మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు.మెట్రో బదిలీని చాలా కష్టపడి ఒక కొలిక్కి తీసుకువచ్చామన్న రేవంత్ రెడ్డి.. ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మరి మెట్రో విస్తరణకు మాత్రం కేంద్రం ఎందుకు సహకరించట్లేదని నిలదీశారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు కేంద్రం వద్దే ఆగి ఉందని విమర్శించారు. ఇటీవల అన్ని రాష్ట్రాలకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌కు ఆపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌ను ఆపారని తెలిపారు. తెలంగాణపై కేంద్రం తీవ్రమైన వివక్ష కొనసాగిస్తోందని మండిపడ్డారు. మెట్రో అనుమతుల కోసం కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా అని అడిగారు. కిషన్‌రెడ్డి వెనుక ఎవరున్నారో తాను నేరుగా చెప్పట్లేదని అన్నారు. కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రి కాబట్టి ఆయనకే ఎక్కువ బాధ్యత ఉందని హితవు పలికారు.బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ప్రధాని మోదీ రాజీనామా చేస్తారా సీఎం నిలదీశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్ ప్రకటించారని, ఇంకా సాకారం కాలేదని తెలిపారు. అన్నింటికి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే తాము కూడా చేస్తామని ప్రకటించారు."ఫేజ్-1 మెట్రోను మేము కొనుగోలు చేసుకుంటున్నాం. మా డబ్బులే కట్టుకుంటున్నాం. మా గ్యారంటీనే ఇచ్చాం. మా కర్మ బాగలేక ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పోరేషన్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ దగ్గర అప్పుకు మొత్తం ఒప్పందాలు, సంతాకాలు చేసుకున్నాం. నిధుల విడుదలకు ఈరోజు చివరి రోజు. మరి ఈరోజు విడుదల చేస్తావా చెయ్యవా కిషన్‌రెడ్డి. 5 గంటల వరకు బ్యాంక్ ఉంటుంది. ఇది మొదటిది. రెండవది ఫేస్-2 కి 122 కిలోమీటర్లకు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం తీసుకుంటదా తీసుకోదా ఒకవేళ తీసుకోకపోతే మాకు ఎల్ఓసీ ఇవ్వండి. హెచ్ఎమ్ఆర్ఎల్ నుంచి మేమే సేమ్ అదే ఐఆర్ఎఫ్ నుంచి సేమ్ లోన్ తెచ్చుకుని సేమ్ మెట్రో విస్తరించుకుని ప్రజలకు మెట్రోను అంకితం చేస్తాం. ఇంతకుమించి నాకు నీకు గట్టు పంచాయితీ ఏ పంచాయితీ లేదు. మీ పట్ల నాకు గౌరవం ఉంది" రేవంత్ రెడ్డి, సీఎం

## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి -** కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు.పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు."అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి

**మొదటిపేజీ తరువాయి -**

దీప్కేపై దాడి జరిగింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఒక్కసారిగా చెంపపై కొట్టడంతో దీప్కే ఆత్మరక్షణ కోసం ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది.నీట్ పేపర్ లీక్, దేశంలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం జరుగుతుండగానే అభిజీత్ దీప్కేపై ఈ దాడి జరిగింది. ఆందోళన చేస్తున్న అభిజీత్‌ను ఓ గుంపు అడ్డుకుని దాడికి పాల్పడింది. దాంతో, అభిజీత్ పై దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు చితకబాదారు.కొందరు యువతను 'బొద్దింకలు' అంటూ సీజేఐ చేసిన ఓ వివాదాస్పద వ్యాఖ్యకు వ్యంగ్యాస్త్రంగా, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న 30 ఏళ్ల అభిజీత్ దీప్కే మే నెలలో 'కాక్రోచ్ జనతా పార్టీ'ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ ఉద్యమం యువతను ఆకట్టుకుని ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. గతంలో ఢిల్లీ, పుణె నగరాల్లో నిరసనలు చేపట్టిన ఈ బృందం, జైపూర్‌లోనూ ఆందోళనకు పిలుపునిచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో నిరసన తెలుపుతుండగా ఆయనపై దాడి జరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

**మొదటిపేజీ తరువాయి -** బ్రిటన్‌లో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించాలని అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ప్రపంచంలో పిల్లల మానసిక ఆరోగ్యాన్ని, భద్రతను కాపాడటంతో పాటు వారికి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం ప్రకటించారు.డౌనింగ్ స్ట్రీట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, "మన పిల్లలను విఫలం చేస్తున్న వ్యవస్థకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైంది. ఈ నిర్ణయం ద్వారా పిల్లలకు వారి బాల్యాన్ని తిరిగి అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. టెక్ దిగ్గజాల ప్రభావం నుంచి చిన్నారులను రక్షిస్తూ, వారి సురక్షితమైన వాతావరణంలో ఎదిగేందుకు ఈ నిషేధం దోహదపడుతుందని ఆయన వివరించారు.ఇప్పటికే ఆస్ట్రేలియాలో అమలవుతున్న విధానం స్ఫూర్తితో ఈ నూతన పాలసీని తీసుకువస్తున్నారు. దీని ప్రకారం టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై 16 ఏళ్లలోపు వారికి ప్రవేశం ఉండదు. లైవ్ స్ట్రీమింగ్, అపరిచితులతో సంభాషించడం వంటి ఫీచర్లపై కూడా ఆంక్షలు అమలవుతాయి. ఈ నిర్ణయానికి ముందు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో దాదాపు 90 శాతం మంది తల్లిదండ్రులు ఈ నిషేధానికి మద్దతు తెలిపారు.ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. చిన్నారుల రక్షణలో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని ఎన్ఎస్‌పీసీసీ వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్ కంటెంట్ కారణంగా తన కుమార్తెను కోల్పోయిన ఎస్తర్ ఘే అనే తల్లి, ఈ నిషేధం ఎందరో పిల్లల ప్రాణాలను కాపాడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.అయితే, ఈ చట్టం అమలు తీరుపై నిపుణులు కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇటువంటి నిషేధం ఉన్నప్పటికీ, చాలామంది టీనేజర్లు వీపీఎన్ వంటి మార్గాల ద్వారా సోషల్ మీడియాను వినియోగిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ సవాళ్లను అంగీకరించిన ప్రధాని స్టార్మర్, సాంకేతిక అడ్డంకులను సాకుగా చూపి చర్యలు తీసుకోకుండా ఉండలేమని స్పష్టం చేశారు. కఠినమైన వయసు ధ్రువీకరణ వ్యవస్థలతో జులై నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# నల్లకుంట శిలాఫలకంపై వివాదం..

## గిరిజనుల ఆత్మగౌరవాన్ని అవమానపరచొద్దు

## మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోబ్రియా నాయక్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 15 (వార్త సంధ్య) :** రామవరం ఏజెన్సీ ప్రాంత గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోబ్రియా నాయక్ హెచ్చరించారు. నల్లకుంట చెరువు అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకంలో 19వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ పేరు కాకుండా, సంబంధంలేని 16వ డివిజన్ కార్పొరేటర్ పేరును చేర్చడం తీవ్ర అభ్యంతరకరమని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, సంబంధిత డివిజనల్ ఇంజనీర్లకు వినతిపత్రం అందజేశారు. నల్లకుంట చెరువు 19వ డివిజన్ పరిధిలో ఉండగా, ఆ ప్రాంత ప్రజాప్రతినిధిని పక్కనపెట్టి ఇతర డివిజన్ కార్పొరేటర్ పేరును శిలాఫలకంలో ఉంచడం గిరిజన సమాజాన్ని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లకుంట, ఎర్రకుంట చెరువులపై చిట్టిరామవరం తండా గిరిజన రైతులకు సర్వహక్కులు ఉన్నాయని, ఈ చెరువులతో తమ జీవనాధారం ముడిపడి ఉందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావులేకుండా స్థానిక రైతులను భాగస్వాములను చేయాలని, 19వ డివిజన్ గిరిజన కార్పొరేటర్ పేరునే శిలాఫలకంలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే గిరిజన రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లచ్చిరాం, బోడ కృష్ణ, కల్లూరి కుమార్, వష్య నాయక్, మూడు రమేష్, పూర్ణ, మనోజ్, శ్రీనివాస్ నాయక్, వేణు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి కుంటలపై కన్నేస్తే ఉద్యమం తప్పదు: నల్గొండ జేసీకి కుమ్మర సంఘం వినతి

## కుమ్మరి వృత్తిదారుల హక్కుల కోసం పోరాటం ఉధృతం

## చేస్తాం..?తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర వర్కింగ్

## ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం హెచ్చరిక



**నల్గొండ:, జూన్- 15 (వార్త సంధ్య) :** కుమ్మరి వృత్తిదారుల జీవనాధారమైన మట్టి కుంటలను ఆక్రమణల నుండి కాపాడాలని, వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (ం=ఖూ) డిమాండ్ చేసింది. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.?ఆక్రమణల వల్ల ప్రశ్నార్థకంగా మారిన వృత్తి ?జిల్లా వృత్తిదారుల సంఘం అధ్యక్షులు ఆమంచి శరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న మట్టి కుంటలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సంప్రదాయ కుమ్మరి వృత్తి మనుగడ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముడిసరుకైన మట్టి లభించక వేలాది కుమ్మరి కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయని, వెంటనే స్పందించి మట్టి కుంటలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.?సంక్షేమ పథకాలు అమలు చేయాలికుమ్మరి వృత్తిని నమ్ముకున్న కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు, ఆర్థిక సహాయం అందించాలని నాయకులు కోరారు.అలాగే ముడి సరుకులపై సబ్సిడీ ఇవ్వడంతో పాటు, ఆధునిక పరికరాలను పంపిణీ చేసేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.హక్కుల సాధన కోసం పోరాటం: ఏడుకొండల వెంకటేశం ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ.. కుమ్మరి వృత్తిదారుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. “మట్టి కుంటలను కాపాడకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుంది. రాష్ట్రంలో ఎక్కడ కుమ్మరులకు అన్యాయం జరిగినా సంఘం అండగా నిలబడి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తుంది” అని ఆయన హెచ్చరించారు.వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నాయకులు డిమాండ్ చేయగా.. ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు.భారీగా తరలివచ్చిన నాయకులు ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, జిల్లా కన్వీనర్ రాదారపు బిక్షపతి, జిల్లా కో-కన్వీనర్ గంగాధరి వెంకటేశ్వర్లు, జిల్లా మాజీ అధ్యక్షులు నిమ్మనగోటి లింగయ్య, నల్గొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మనగోటి శ్యాంప్రసాద్, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిజాల వెంకన్న పాల్గొన్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు నిదానంపల్లి వెంకటస్వామి, అర్రూరి బాలనర్సయ్య, ఆమంచి వెంకన్న, దుపాటి హరికృష్ణ, మీడియా విభాగం జిల్లా కన్వీనర్ ఏరుకొండ నాగరాజు, యువత విభాగం జిల్లా కన్వీనర్ ఏరుకొండ హరి, కొయ్యడ చంద్రశేఖర్, బొడ్డుపల్లి ప్రసాద్, ఊట్కూరి యాదయ్య, బొడ్డుపల్లి మహేష్, ఏరుకొండ నాగయ్య, యార యాదయ్య బేకుమట్ల రాజు, శిరసవాడ లక్ష్మయ్య బొడ్డుపల్లి శ్యామ్, కొయ్యడ సాయిబాబా తదితరులు కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణిలో సమ్మె సైరన్..!

## 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధం కావాలి

## ఎఐటీయూసీ యూనియన్ హెచ్చరిక



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 15 (వార్త సంధ్య) :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే సంస్థను స్తంభింపజేసే స్థాయిలో ఉద్యమానికి దిగుతామని ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. కార్మికుల సహనానికి హద్దులు దాటిపోయాయని, ఈ నెల 22వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం పీవీకే-5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కార్మికుల సహనాన్ని బలహీనతగా భావించడం తగదని, సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కనబరచకపోవడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ వాటి పరిష్కారంపై యాజమాన్యం స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కార్మిక సంక్షేమం, సంస్థ భవిష్యత్ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి కీలక అంశాలను పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సింగరేణి మనుగడకే ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పులు, పెర్క్విపై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాలు వంటి సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. యూనియన్‌తో జరిగిన అధికారిక సమావేశాల్లో అంగీకరించిన అనేక డిమాండ్లు కూడా అమలు కాకపోవడం వెనుక రాజకీయ జోక్యం కారణమని ఆరోపించారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం ఎఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాట ఫలితమేనని పేర్కొన్న రంగయ్య, పోరాటం ద్వారానే ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటే మరిన్ని సమస్యలకు పరిష్కారం సాధించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసిన ఆయన, కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త గనుల ప్రారంభం, సంస్థ విస్తరణ, భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాల కల్పనపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని ఒత్తిడి చేస్తూనే సంస్థ విస్తరణను విస్మరించడం సరికాదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్యం కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతాయని హెచ్చరించిన రంగయ్య, అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా సిద్ధంగా ఉండాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలపాలని కోరారు. ఈ గేట్ మీటింగ్‌లో బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్లు కత్తెర్ల రాములు, గట్టయ్య, పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, మధుకృష్ణ, కమల్‌తో పాటు పలువురు కార్మిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాటర్ గేట్ వాల్స్‌పై మూతలు ఎక్కడ..?

## చిన్నారుల ప్రాణాలకు ముప్పు..

## చెత్తతో నిండుతున్న వాటర్ వాల్స్

## ప్రమాదం ముంగిట తిప్పనపల్లి తండా

## వాటర్ గేట్ వాల్స్‌పై మూతలు పెట్టేదెప్పుడు..?





**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 15 (వార్త సంధ్య) :** మండలంలోని తిప్పనపల్లి తండాలో ఉన్న రెండు వాటర్ గేట్ వాల్స్‌కు రక్షణ మూతలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూతలు లేకపోవడం వల్ల కప్పలు, ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు తదితర చెత్తాచెదారం వాటర్ గేట్ వాల్స్‌లోకి చేరి నీటి నాణ్యత దెబ్బతింటోందని గ్రామస్తులు చెబుతున్నారు. అంతేకాకుండా చిన్నారులు ఆసక్తితో వాటి వద్దకు వెళ్లి లోపల తొంగిచూసే సమయంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రజలు నిత్యం సంచరించే ప్రాంతంలోనే ఈ వాటర్ గేట్ వాల్స్ ఉండటంతో ప్రమాద ముప్పు మరింత పెరిగిందని పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగే ముందు అధికారులు స్పందించి వెంటనే వాటర్ గేట్ వాల్స్‌కు బలమైన మూతలు ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. “ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ప్రజల ప్రాణాలకు భద్రత” అని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం తిప్పనపల్లి తండాలోని ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గూడెంలో ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

## రైల్వేస్టేషన్, పార్టీ కార్యాలయంలో సంబురాలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 15 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు జేబీ శౌరి, మోత్కురి ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతుకూరి ధర్మారావు మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి తన కృషి, నిజాయితీ, ప్రజాసేవ పట్ల అంకితభావంతో తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు భట్టి విక్రమార్క అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాట యోధుడిగా, ఖమ్మం జిల్లాలో గాంధేయ భావజాలాన్ని ఆచరిస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా, సీఎల్పీ నాయకుడిగా పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. తెలంగాణ ఎల్లప్పుడూ ముందు ఉండేవారని ఆయన పేర్కొన్నారు. బేబీ శౌరి మాట్లాడుతూ తెలంగాణ రాజకీయ చరిత్రలో మైలురాయిగా నిలిచిన “పీపుల్స్ మార్చ్ పాదయాత్ర” ద్వారా గ్రామాలు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు, నిరుద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన ప్రజానాయకుడు భట్టి విక్రమార్క అని తెలిపారు. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారి స్వరాన్ని ప్రభుత్వాలకు వినిపించిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.



ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం, క్రమశిక్షణ, నిరాడంబర జీవనశైలి యువతకు ఆదర్శమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ ఏలూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, ఎం.డి.రజాక్, ఎండి గౌస్ మోహినుద్దీన్, అల్లాడి నరసింహారావు, అజ్మీర సురేష్ నాయక్, వీరాపురం రామ్ లక్ష్మణ్, పోరేటి నరేష్, కసనబోయిన భద్రం, ఆరిఫ్ ఖాన్, ఉస్మాన్ అలీ ఖాన్, లాల్ సింగ్, ఏలూరి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల బాలికపై 50 ఏళ్ల కామాంధుడు అత్యాచారం!

## దేహశుద్ధి చేసిన గ్రామస్తులు!




**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 15(వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నందిపాడు గ్రామంలో 11 సంవత్సరాల బాలికపై అత్యాచారం జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఈ దారుణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటన అనంతరం నిందితుడు పారిపోయి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. బాధిత బాలిక కుటుంబ సభ్యులు ప్రాంతానికి చెందినవారిగా, నిందితుడు అదే గ్రామానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కేసును పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### చిన్నారిపై దారుణం.. ఆందోళనలో గ్రామస్తులు


కేసు నెలవడంతో ఆగ్రహంతో రగులుతున్న బంధువులు ఇంటికి వచ్చిన ఇళ్ల తరలీ వెళ్లారని, బాలిక దారుణానికి గురికావడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని త్వరగా అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేసును నిందితుడిని మరిన్ని వివరాలు రాబట్టే దర్యాప్తులో పోలీసులు నిమగ్నమయ్యారు.

# అశ్వారావుపేట కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు..

## అన్నపురెడ్డిపల్లి సమావేశంతో రాజకీయ వేడి..!

## పీసీసీ చీఫ్, సీఎం అపాయింట్‌మెంట్ కోసం యత్నాలు

## ఎమ్మెల్యేపై ఫిర్యాదుకు అసమ్మతి నేతల కసరత్తు?




**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 15 (వార్త సంధ్య) :** అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో అంతర్గత విభేదాలు బహిర్గతమవుతున్నాయా..? అసమ్మతి నాయకులు ఒక్క తాటిపైకి వస్తున్నారా..? ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమవుతున్నారా..? అనే చర్చ ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల అన్నపురెడ్డిపల్లి వేదికగా జరిగిన సమావేశం ఈ చర్చలకు మరింత ఊతమిచ్చింది. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట మండలాలకు చెందిన పలువురు నాయకులతో పాటు అశ్వారావుపేట, ములకలపల్లి ప్రాంతాల అసమ్మతి వర్గ నేతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో పార్టీ పరిస్థితులు, నియోజకవర్గ రాజకీయ పరిణామాలు, స్థానిక నాయకత్వంపై అసంతృప్తి వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వాన్ని కలిసి తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు అసమ్మతి నేతలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పీసీసీ చీఫ్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినట్లు, అలాగే ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం కూడా యత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. దీంతో అసమ్మతి వర్గం తదుపరి అడుగులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇటీవల జరిగిన డీసీసీ చీఫ్ నియామకం తర్వాత స్థానికంగా కొందరు నాయకుల్లో అసంతృప్తి పెరిగిందనే ప్రచారం కూడా వినిపిస్తోంది. పార్టీ నిర్ణయాలు, నాయకత్వ వ్యవహార శైలి, స్థానిక స్థాయిలో ప్రాధాన్యత అంశాలపై కొందరు నేతలు బహిరంగంగానే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. సమావేశం కేవలం పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలపై చర్చ కోసమేనని కొందరు చెబుతుండగా, మరోవైపు ఇది అసమ్మతి శక్తుల ఏకీకరణకు సంకేతమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. మొత్తానికి అన్నపురెడ్డిపల్లి సమావేశం తర్వాత అశ్వారావుపేట కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయా..? అసమ్మతి నేతలు రాష్ట్ర నాయకత్వం ముందు ఏ అంశాలను ప్రస్తావించబోతున్నారు..? ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలకు సిద్ధమవుతున్నారు..? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయన్నదే ఆసక్తికరంగా మారింది.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

## - గ్రామ సర్పంచి దండెవేన సంధ్య బానేష్



**మంథని, జూన్ 15 (వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ పిల్లలకు 2026- 2027 విద్య సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను మంగళవారం విద్యార్థులకు గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గుంజపడుగు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రైవేటు పాఠశాలల మోజు తగ్గించుకోవాలన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోని అనుభవతులైన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని ఆమె తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాసుల్లో బోధిస్తున్నారని గతంలో లాగా ఇరుకుగదులు కాకుండా గాలి వెలుతురు వచ్చే విధంగా క్లాస్ రూముల నిర్మించారని ఆమె గుర్తు చేశారు. పిల్లకు మధ్యాహ్న భోజనం యూనిఫామ్ ఇస్తున్నారని ఇప్పుడు ప్రవేటు స్కూల్స్ కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం మెరుగ్గా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యురాలు దాసరి లక్ష్మి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# ఇందిరా గాంధీ కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆదివాసీ కాంగ్రెస్ బస్ యాత్ర

### గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తి

### గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం



**హైదరాబాద్, జూన్ 15 (వార్త సంధ్య):** గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ చేసిన సేవలను ప్రజలకు చాటిచెప్పేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్ యాత్ర నిర్వహించనున్నట్లు టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. తాను పెరిగిన గ్రామంలో అధిక సంఖ్యలో లంబాడీ కుటుంబాలు నివసించేవని, వారి జీవన పరిస్థితులను చిన్నప్పటి నుంచే దగ్గరగా గమనించే అవకాశం తనకు లభించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. 1976లో లంబాడీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసిన ఇందిరా గాంధీ, వారి అభివృద్ధి కోసం పలు కీలక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంలో ఇందిరా గాంధీ ఎప్పుడూ ముందుండేవారని, గిరిజనుల వెనుకబాటుతనాన్ని గుర్తించి వారికి ఎస్టీ రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి అభివృద్ధికి బాటలు వేసిందని అన్నారు. నేడు గిరిజన సమాజం విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సాధించిన పురోగతికి ఆ నిర్ణయాలే పునాది అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే సిద్ధాంతానికి అనుగుణంగా రాష్ట్రంలో కుల గణన చేపట్టారని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా చేపట్టనున్న బస్ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే ఈ యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీ గిరిజన సంక్షేమానికి చేసిన సేవలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టాప్ డయేరియా, పల్స్ పోలియో, నులిపురుగుల నివారణ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

### అన్ని శాఖల సమన్వయంతో ప్రజారోగ్య కార్యక్రమాల అమలుకు చర్యలు

### జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి





**రంగారెడ్డి జిల్లా బ్యూరో,వార్త సంధ్య:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో కార్యక్రమం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ), హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి మాట్లాడుతూ, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జూన్ 1 నుంచి జూన్ 15 వరకు సన్నాహక దశగా, జూన్ 16 నుంచి జూలై 31 వరకు అమలు దశగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డయేరియా నివారణపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆసుపత్రుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వల్నరబుల్ గ్రూపులకు తక్షణ ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అన్ని విద్యా మరియు ఆరోగ్య సంస్థల్లో ఓఆర్ఎస్ కార్నర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. జిల్లాలోని ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జూలై 13న నిర్వహించనున్న కార్యక్రమంపై కూడా సమావేశంలో చర్చించారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్ విద్యాసంస్థల ద్వారా డీ-వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో మాత్రలు తీసుకోలేని పిల్లలకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ కార్యక్రమం ద్వారా మరోసారి మాత్రలు అందజేయనున్నట్లు వెల్లడించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో అవగాహన కల్పించి వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 118 ఫిర్యాదులు

### ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

### రెవెన్యూ శాఖకు 28, ఇతర శాఖలకు 90 వినతులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో , జూన్ 15 (వార్త సంధ్య):** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 118 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డికి వివరించి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలిస్తూ, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 28 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 90 దరఖాస్తులు అందగా, మొత్తం 118 వినతులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ అనంతరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యా హక్కు వ్యాపారం కాదు.. ఫీజుల దోపిడీని అరికట్టాలి : చెన్నోజు శ్రీనివాసులు

### ఫీజుల నియంత్రణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్

### కార్పొరేట్ విద్యా వ్యాపారులకు అండగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపణ

### కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ప్రజాసంఘాల మీడియా సమావేశం




**హైదరాబాద్, జూన్ 15 (వార్త సంధ్య):** విద్యా వికాసం లేని చోట సమాజం వికసించదని, విద్య హక్కు కాని వ్యాపార వస్తువు కాదని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ రాష్ట్ర చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు అన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ, అక్రమ డొనేషన్లు, విద్యా రంగంలో పెరుగుతున్న వాణిజ్యీకరణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం తెలంగాణ తల్లిదండ్రుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నోజు శ్రీనివాసులు మాట్లాడుతూ, లక్షలాది మంది తల్లిదండ్రులు విద్యా ఫీజుల భారంతో అప్పుల ఊబిలో కూరుకుపోతుండగా, కార్పొరేట్ విద్యాసంస్థలు కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఫీజుల నియంత్రణకు శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. విద్య హక్కుగా ఉండాల్సిన పరిస్థితిలో వ్యాపార వస్తువుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు ప్రశ్నలు సంధించిన ఆయన, స్కూల్స్ మరియు ఇంటర్ కళాశాలల ఫీజుల నియంత్రణ కమిటీని ఇప్పటివరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. పేద కుటుంబాల పిల్లల విద్యా ఫీజులను ప్రభుత్వం ఎందుకు భరించడం లేదని, ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమ డొనేషన్లు, మేనేజ్‌మెంట్ సీట్ల పేరుతో సాగుతున్న దోపిడీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. లక్షలాది తల్లిదండ్రులు అప్పుల పాలవుతుంటే ప్రభుత్వం ప్రజల పక్షాన నిలుస్తుందా లేక కార్పొరేట్ విద్యా వ్యాపారుల పక్షాన నిలుస్తుందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రజల పక్షాన ఉంటే ఈ అంశాలపై మౌనం ఎందుకని ప్రశ్నిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. స్కూల్స్, ఇంటర్ కళాశాలల ఫీజుల నియంత్రణ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని, పేద కుటుంబాల పిల్లల ఫీజులను ప్రభుత్వమే భరించాలని కోరారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది వేతనాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి శ్రమదోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమ డొనేషన్లపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలంటే విద్యను ప్రభుత్వ బాధ్యతగా గుర్తించి అందరికీ ఉచిత, సమాన, నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. విద్యా దోపిడీకి ఇది మాత్రమే శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. ప్రజల విద్యా హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు, ప్రజాసంఘాలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమ కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ వైస్ చైర్మన్ గోపీనాథన్ కట్టేకోల, గంగుల నరసింహారెడ్డి, కృష్ణ నాయక్, సాయికుమార్, రుక్ముద్దీన్, పి. రాణి, అంబటి తులసి, రత్న కుమారి, బచ్చు రామకృష్ణ, చంద్రశేఖర్ సాగర్, పి. రమేష్, బొట్టు రమేష్, చిన్న రాములు, గోరేటి గణేష్, యోగేష్ యాదవ్, ముఖేష్, జి. మాధవాచారి, అరెపోగు లక్ష్మణ్, ఆంజనేయచారి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ అన్న నువ్విచ్చిన మాటే... నిలుపుకో

### ముఖేష్ గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

### జూలై 1 జయంతి నాటికి ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాలి

### బీసీ ల బిడ్డలు రేవంత్ అన్న నీకు కనపడలేదా..?

### లేదంటే ప్రజల సహకారంతో మేమే విగ్రహం ఏర్పాటు చేస్తాం : అంబర్‌పేట్ శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్, జూన్ 15 (వార్త సంధ్య):** దివంగత మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ జయంతి అయిన జూలై 1వ తేదీ నాటికి ఆయన విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, లేకపోతే అభిమానులు, అనుచరుల సహకారంతో తామే విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని కాంగ్రెస్ నాయకుడు అంబర్‌పేట్ శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రజాసేవలు, నాయకత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గత ఏడాది నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రెండుసార్లు కలిసి ముఖేష్ గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ముఖేష్ గౌడ్ హైదరాబాద్ నగర అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణలోనూ బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముఖేష్ గౌడ్ కీలకంగా పనిచేశారని అన్నారు. హైదరాబాద్ నగరంలో పలు ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అయిన ముఖేష్ గౌడ్‌కు మాత్రం తగిన గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. బీసీ నాయకులకు తగిన గౌరవం దక్కడం లేదనే భావన కార్యకర్తల్లో పెరుగుతోందన్నారు. ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రస్ట్ ద్వారా వందలాది పేద విద్యార్థులకు ఉచిత విద్య అందుతున్న విషయాన్ని గుర్తు చేసిన శ్రీనివాస్ యాదవ్, సమాజానికి ఆయన కుటుంబం చేస్తున్న సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముఖేష్ గౌడ్ జయంతి నాటికి ప్రభుత్వం అధికారికంగా విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మొజంజాహి మార్కెట్, ట్యాంక్‌బండ్ లేదా ఆయన నివాస ప్రాంతంలో ప్రభుత్వ లాంఛనాలతో విగ్రహం ప్రతిష్ఠిస్తే అభిమానులందరికీ సంతోషంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు కలిసి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి విగ్రహం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, డివిజన్లలో ఉన్న ముఖేష్ గౌడ్ అభిమానులు ఈ ఉద్యమంలో పాల్గొంటారని తెలిపారు. ముఖేష్ గౌడ్ సేవలను భావితరాలకు చాటిచెప్పేందుకు ఆయన జ్ఞాపకార్థం విగ్రహం ఏర్పాటు అవసరమని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# ఉపసర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలి: బొట్ల కార్తీక్

### చెక్ పవర్ రద్దు చేస్తే గ్రామ పాలనలో పారదర్శకత దెబ్బతింటుందని ఆందోళన

### ఉపసర్పంచ్‌లకు రూ.5 వేల గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3 వేల వేతనం డిమాండ్

### జూన్ 25న 'హలో ఉపసర్పంచ్ -- ఛలో హైదరాబాద్' మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా పిలుపు



**హైదరాబాద్, జూన్ 15 (వార్త సంధ్య):** ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలనే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ హక్కులను కాపాడితే పాలాభిషేకం చేస్తామని, లేకపోతే నిరసనాభిషేకం తప్పదని హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపసర్పంచ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది ఉపసర్పంచ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి నిధుల పారదర్శక వినియోగం కోసం 2018 పంచాయతీరాజ్ చట్టం ద్వారా ఉపసర్పంచ్‌లకు కల్పించిన చెక్ పవర్‌ను తొలగించడం గ్రామ పాలన వ్యవస్థను బలహీనపరచడమేనని అన్నారు. గ్రామ పంచాయతీ లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు చెక్ పవర్ కీలకమని పేర్కొన్నారు. దీనిని రద్దు చేయడం ద్వారా అధికారుల అవినీతికి అవకాశం కల్పించినట్లవుతుందని ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లతో పాటు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు కూడా ప్రజాప్రతినిధులేనని, వారికి తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వేతనాలు పెంచగలిగే ప్రభుత్వం ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల గౌరవ వేతనాల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చూపుతోందని ప్రశ్నించారు. ఉపసర్పంచ్‌లకు నెలకు రూ.50 వేల గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.30 వేల గౌరవ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల పేర్లను కూడా పొందుపరచాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం యువతకు ఆదర్శమని పేర్కొన్న బొట్ల కార్తీక్, యువ రాజకీయ నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చెక్ పవర్ తొలగిస్తే గ్రామీణ యువతలో రాజకీయాల పట్ల విరక్తి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపసర్పంచ్‌లకు ప్రత్యేక ఛాంబర్లు ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా "హలో ఉపసర్పంచ్ -- ఛలో హైదరాబాద్" పేరుతో జూన్ 25న ఉదయం 10 గంటలకు ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రతి ఉపసర్పంచ్ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జూన్ 25లోపు ప్రభుత్వం చెక్ పవర్‌పై వస్తున్న వార్తలను ఖండిస్తూ స్పష్టమైన ప్రకటన చేయకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అవసరమైతే విద్యార్థి సంఘాల మద్దతుతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, తమ హక్కుల కోసం ఢిల్లీలో కూడా ధర్నా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ స్వప్న, ఉపాధ్యక్షురాలు కవిత, ఫోరం కమిటీ సభ్యులు, వివిధ జిల్లాలకు చెందిన ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు

# 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

### వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరం

### విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, జూన్ 15 (వార్త సంధ్య):** రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏ . రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

#### 19 నుంచి వర్షాలు మరింత ఉధృతం

నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో తెలంగాణ అంతటా నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశముందని పేర్కొన్నారు.

#### నైరుతి రుతుపవనాలు

ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల్ జిల్లాను ఆవరించాయని, ప్రస్తుతం హైదరాబాద్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందన్నారు. జూన్ 14 నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకినట్లు వెల్లడించారు.

#### సాధారణం కంటే 10 శాతం తక్కువ వర్షపాతం

రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మంత్రి తెలిపారు. సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు నమోదైందన్నారు. అయితే రానున్న రోజుల్లో వర్షాలు పెరిగే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

#### జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని జిల్లాల అధికారులు నిరంతర అప్రమత్తతతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట

**పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 15(వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ సోమవారం అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు విద్యా సంబంధిత అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం తిరుమలకుంట గ్రామపంచాయతీ పరిధిలోని తోగ్గూడెం, తిరుమలకుంట కాలనీలలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలల వద్ద రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రహరీ గోడలను ప్రారంభించారు. అనంతరం మొద్దులమడ గ్రామంలో ఇటీవల నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.4 లక్షల నిధులతో జీపీఎస్ పాఠశాలలో కల్పించిన మౌలిక వసతులను ప్రారంభించారు. దిబ్బ గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దురదపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలలో బాలబాలికల కోసం రూ.4 లక్షల వ్యయంతో విడివిడిగా నిర్మించిన మల్టీ యూనిట్ టాయిలెట్లను ప్రారంభించారు. చివరిగా నారాయణపురం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల సంక్షేమం కోసం తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, పీసీసీ జిల్లా సభ్యులు తుమ్మా రాంబాబు, కోలా లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సూపర్వైజర్ వార్డుల సందర్శన

**- 3 నుండి 6 సంవత్సరాలలోపు పిల్లల్ని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలి**



**మంథని జూన్ 15(వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మ వాడ లో గల 5వ అంగన్వాడి సెంటర్ లో సోమవారం ఏఎల్ఎంఎస్సి సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి అధిక సంఖ్యలో తల్లులు హాజరైయ్యారు. 3 నుండి 6 సంవత్స రాల పిల్లల్ని అంగన్వాడి సెంటర్ కి పంపించాలని తల్లులకి అవగాహన కల్పించినట్లు సెక్టార్ సూపర్వైజర్ శారదా తెలిపారు. అందులో భాగంగా ఈరోజు 3 నుండి 6 సంవత్సరాల పిల్లల కొరకు గృహ సందర్శన చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లల్ని అంగన్వాడి సెంటర్ కి పంపించాలని తల్లులకి వివరించాను. ఈ కార్యక్రమములో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తల్లులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని ఆమె ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లోని టీచర్లకు, ఆయాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ శారద తోపాటు అంగన్వాడీ టీచర్లు ఉదయమ్మ, శారదమ్మ, పార్వతమ్మ, మారుపాక నిఖిల, ఆయాలు పాల్గొన్నారు.

## ఫిషరీస్ ఫాండ్ ల్యాండ్ సర్వే పూర్తి - కబ్జాకు చెక్కు పెట్టిన క్రాంతి



**మంథని, జూన్15( వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ పరిధిలోని అయ్యగారి చెరువు పక్కన సర్వే నెంబర్ 20 లో గల ఒక ఎకరం 38 గుంటలు ఫిషరీష్ ఫాండ్ కు సంబందించిన ల్యాండ్ ను మంగళవారం సర్వే పూర్తి చేయించినట్లు మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్, మంథని అధ్యక్షులు పోతరవేణి క్రాంతికుమార్ తెలిపారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దుళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కొంత మంది కబ్జా కోరులు ఈ ఫిషరీస్ కు చెందిన ల్యాండ్ ను కబ్జా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఇట్టి కబ్జా కోరులపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన మంథని మత్స్య శాఖ తరుపున అధికారులను కోరారు.ఈ యొక్క ఫీషరీస్ ల్యాండ్ ను సర్వే చేపించడానికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబుకు మంథని అర్డివో ఎమ్అర్ఓ మత్స్యశాఖ తరుపున క్రాంతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజిక సేవకులు మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో అభిమానులు, మిత్రులు మరియు స్థానిక ప్రజల సమక్షంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేయగా, అనుచరులు గజమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై సాయిబాబు చౌదరికి శాలువా కప్పి, బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.బండి రమేష్ మాట్లాడుతూ మందలపు సాయిబాబు చౌదరి నిరంతరం ప్రజల కోసం పరితపించే నాయకుడు. కరోనా వంటి విపత్కర సమయాల్లో, వరదల వేళ ప్రజలకు చేసిన సేవలు ఆదర్శప్రాయం. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి" అని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని సాయిబాబు చౌదరి ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లా ఆసుపత్రికి చర్మవ్యాధుల చికిత్స నూతన పరికరాలు అందుబాటులోకి

**- జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే. శ్రీధర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జులై 15 (వార్త సంధ్య) :** పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు మరియు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి చర్మవ్యాధుల చికిత్సకు సంబంధించిన నూతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పరికరాల సహాయంతో చర్మంపై ఏర్పడే పులిపిరులు, స్కిన్ ట్యాగ్‌లను తొలగించ వచ్చును మరియు ఇతర చిన్న చర్మ సంబంధిత సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చును.పెద్దపల్లి పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ప్రత్యేక వైద్య సేవలను జిల్లా ఆసుపత్రిలో వినియోగించుకోవాలని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి జిల్లా ప్రతిని, రామగుండం,జూన్ 15(వార్త సంధ్య) :** ప్రజలకు అవసరమైన సమయం లో ప్రభుత్వం అండగా నిలుస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. 4వ డివిజన్‌కు చెందిన సమినాబేగంకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.22 వేల చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 4వ డివిజన్ కార్పొరేటర్ కంకణాల మౌనిక రాజు ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న విద్యార్థులకు**

# బ్రేక్ ఫాస్ట్ & మిల్క్ పథకాన్ని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్..

**హైదరాబాద్ రిపోర్టర్ జూన్ 15. :** విద్యార్థులకు పుస్తకాలు & నోట్ బుక్స్ పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్ , యశస్వినీ రెడ్డి , కలెక్టర్ ప్రియాంక ఆలా ,డీఈవో యాదయ్య , మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్, ఇతర ముఖ్య అధికారులు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రభుత్వ పాఠశాలలో చదివే 29 లక్షల మంది విద్యార్థిని విద్యార్థులకు అల్పాహారం - పాలు పథకాన్ని ప్రారంభిస్తుంది.. విద్యార్థులకు దీని ద్వారా పౌష్టిక ఆహారం అందిస్తుంది ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా బడి బాట కార్యక్రమం ద్వారా డ్రాప్ ఔట్ విద్యార్థులను బడి లోకి తీసుకురావడం ఇతర పాఠశాలల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంది.. స్వచ్ఛంద సంస్థల సహకారం ప్రభుత్వం దాదాపు 800 కోట్లు ఖర్చు చేస్తుంది.. పిల్లలందరూ మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని పౌష్టిక ఆహారం అందిస్తున్నాం.. ఈరోజు నుండి ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభిస్తున్నాం.. వారు స్కూల్ లోనే తినేలా బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేస్తున్నాం. ఉదయం లేవగానే రెడీ అయి స్కూల్ కి రావాలే ఇక్కడే బ్రేక్ ఫాస్ట్ లంచ్ చేయాలి.. మీ తల్లిదండ్రులు కష్టపడుతున్న దాని కంటే రెట్టింపు చదువుకొని కష్టపడి మంచి పేరు తీసుకురావాలి..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి.. ప్రభుత్వ పాఠశాలలు ,ప్రభుత్వ హాస్పిటల్ లు వద్దు ,ప్రభుత్వ ఉద్యోగం కావాలని విధంగా వ్యవహరిస్తున్నారు.. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్నాం.. అందరూ కష్టపడి చదువుకోవాలి.. ఈ అల్పాహారం పథకం ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు



వర్తిస్తుంది.. అల్పాహారం పథకం ద్వారా విద్యార్థుల్లో ఆకలిని నివారించడం ,పోషకాహార లోపాన్ని తగ్గించడం , ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడటం,పాఠశాల హాజరును పెంచడం,డ్రాప్‌అవుట్‌లను తగ్గించడం ,విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ప్రతిభను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది

రోజు అల్పాహారం పాలు/రాగి మాల్ట్ ఇస్తున్నాం..

సోమవారం దోసె - చట్నీ / చపాతీ - కూర పాలు

మంగళవారం మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ రాగి జావ

బుధవారం పూరీ (2) - ఆలూ కుర్మా పాలు

గురువారం మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ రాగి జావ

శుక్రవారం మిల్లెట్ ఉప్మా / పొంగల్ - చట్నీ పాలు

శనివారం బొండా (2) - చట్నీ రాగి జావ

సోమ, బుధ, శుక్రవారాలు - పాలు

మంగళ, గురు, శనివారాలు - రాగి జావ

అల్పాహారం కోసం ప్రభుత్వం వార్షిక వ్యయం రూ. 540 కోట్లు ఖర్చు చేస్తుంది పాల సరఫరా కోసం వార్షిక వ్యయం: రూ. 180 కోట్లు ఖర్చు చేస్తుంది..మొత్తం వార్షిక వ్యయం రూ. 720 కోట్లు ఈ పథకానికి ప్రభుత్వం ఖర్చు చేయనుంది..ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, విద్యా నాణ్యతను పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది..హైదరాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ -- అల్పాహార పథకం (2026-27) సంక్షిప్త నోట్‌తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార స్థాయిని మెరుగుపరచే లక్ష్యంతో 2026-27 విద్యా సంవత్సరం నుంచి అల్పాహార పథకాన్ని అమలు చేయనుంది.హైదరాబాద్ జిల్లాలో జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.మొత్తం 93,501 మంది విద్యార్థులు చదువుతున్నారు.మొదటి దశ అల్పాహారం కింద హైదరాబాద్ జిల్లాలో 45 పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయి. ఈ పథకం ద్వారా 12,437 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. మన్నా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుంది.

ప్రాథమిక పాఠశాలలు: 23 (5,258 మంది విద్యార్థులు)

ఉన్నత ప్రాథమిక పాఠశాలలు: 2 (175 మంది విద్యార్థులు)

ఉన్నత పాఠశాలలు: 20 (7,004 మంది విద్యార్థులు)

విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ఈ క్రింది ఆహార పదార్థాలు అందించబడతాయి:

ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యం, పాఠశాల హాజరు, ఏకాగ్రత విద్యా ఫలితాలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టుశిక్షణ కార్యక్రమాలు**

# దోహదం చేస్తాయి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 15 (వార్త సంధ్య):** లింగోజిగూడా డివిజన్ పరిధిలోని మైత్రి నగర్‌లో గతంలో కుట్టుశిక్షణ పొందిన మహిళల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ అందించేందుకు ముందుకు వచ్చిన బండి ప్రభావతి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఒక గొప్ప అవకాశమని, దీని ద్వారా ప్రతి మహిళ స్వయం ఉపాధి పొందడంతో పాటు ఎక్కడైనా ఉపాధి అవకాశాలను సృష్టించుకోగలదని పేర్కొన్నారు.శిక్షణ పూర్తయిన అనంతరం అందించే సర్టిఫికెట్ ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కుట్టుశిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబ అవసరాలకు తోడ్పడడమే కాకుండా ఆర్థిక స్వావలంబన సాధించి మహిళా సాధికారత దిశగా ముందుకు సాగగలరని అన్నారు. ఒక మహిళ స్వంతంగా సంపాదించగలిగితే కుటుంబంలో, సమాజంలో ఆమె గౌరవం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. అనంతరం కుట్టుశిక్షణ పూర్తి చేసిన మహిళలు స్వయంగా కుట్టిన దుస్తులను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఒక పీకో మిషన్ అందజేయడం జరిగింది. ఈ పీకో మిషన్ ద్వారా మహిళలు అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తిలక్ రావు తన వంతు సహాయంగా మరో పీకో మిషన్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోట రాజశేఖర రెడ్డి, శ్రీధర్, ట్రైనర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి**

**ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్ 15( వార్త సంధ్య) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి పెద్దపెల్లి జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ముత్తారం మండలం లక్కారం గ్రామ పంచాయతీ కు చెందిన వీరగొని రాజేశం మచ్చ పేట గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 79 లో ఎకరం 33 గుంటల వ్యవసాయ భూమి చట్టబద్ధంగా కొనుగోలు చేయడం జరిగిందని, తన భూమిని అధికారికంగా పున సర్వే చేయించి సంబంధిత రెవెన్యూ రికార్డులలో ఉన్న తప్పులను సరిచేసి చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఓదుల గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్ సెంటర్ ను హై స్కూల్ ప్రాంగణంలోకి మార్పు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచి కనకిరెడ్డి సతీష్ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరిఖని కళ్యాణ్ నగర్ కు చెందిన కొత్తపల్లి సమ్మక్క తన ఇంటి వెనకాల ఉన్న కోత్వాల్ వెంకటేష్ అక్రమంగా మా ఇంటి సరిహద్దులను ఆక్రమంగా చొర పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు పెద్దపల్లి పట్టణం ప్రగతి నగర్ కు చెందిన కొండా రమాదేవి తమకు గృహ జ్యోతి పథకం కింద లబ్ధి చేకూర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపీడీఓ కు రాస్తూ అవసరాన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేబీఆర్ పార్క్ కు ధీటుగా బి.ఎన్.రెడ్డి నగర్ లో ఆహ్లాదకరమైన పార్కు అభివృద్ధి : మధుయాష్కి గౌడ్

**18న సీఎం రేవంత్ రెడ్డి గారి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు**

**సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ కలిసి ఏర్పాట్ల పరిశీలన**



**ఎల్బీనగర్, వార్త సంధ్య:** బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంత వాసులకు కేబీఆర్ పార్కు లాగా ఆహ్లాదకరమైన వాతావరణం లో అద్భుతమైన పార్కు ఏర్పాటు కాబోతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఈనెల 18న బి.యన్ రెడ్డి నగర్ ను ఆనుకొని ఉన్న ఫారెస్టులో వన మహోత్సవ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి మధుయాష్కి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్, డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి, ఏసీపీ కాశీ రెడ్డి తో కలిసి సీఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 102 ఎకరాల్లో పార్కును అందులో అందుబాటులోకి రావడం అదృష్టమన్నారు. 30 ఏళ్లుగా ఉన్న స్థల వివాదాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుందని పేర్కొన్నారు. పార్కుగా అభివృద్ధి చేయడమే కాకుండా 20 కోట్ల తో బి.ఎన్.రెడ్డి నగర్ పరిసర ప్రాంత ప్రజలకు వరద, డ్రైనేజీ నీటి సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైన్, డ్రైనేజీ లైన్ల నిర్మాణాలు కూడా చేపడుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోలేదని, హైదరాబాద్ నిధులన్నీ కాళేశ్వరాన్ని తరలించిందని విమర్శించారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇక్కడి నిధులను నగర ప్రజలకే ఖర్చు పెడుతూ అభివృద్ధిని, మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. 18న సాయంత్రం 4 గంటలకు జరిగే సీఎం రేవంత్ రెడ్డి వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిసర ప్రాంతాల కాలనీ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, నాయకులు పర్వతి గణేష్ రెడ్డి, రఘుమారెడ్డి, భీమిలి రామకృష్ణారెడ్డి, కళ్లెం సుజాతా రెడ్డి, రజిని రావు,రాజేశ్వరి,వసంత, భాను, వినయ్ పటేల్, చంద్రకాంత్ గౌడ్,దాము మహేందర్ యాదవ్, శ్రీనాథ్, ప్రవీణ్ రెడ్డి, సూర్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, రేణు గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, మనీష్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, భవాని తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి

**రాజేంద్రనగర్ ఆర్డీఓ గా పనిచేసిన కొప్పుల వెంకట్ రెడ్డికి పదోన్నతి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్ 15(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# జెఎన్‌టీయూహెచ్ నూతన రెక్టర్, రిజిస్ట్రార్లకు విద్యార్థి సంఘం శుభాకాంక్షలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం నూతన రెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎ. దామోదరం, రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎ. జయలక్ష్మిలను బంజారా విద్యార్థి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం వారి ఛాంబర్లలో బంజారా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ భాను ప్రకాష్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు, నాయకులు నూతన అధికారులకు పూలకుండీలు అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ.. జెఎన్‌టీయూహెచ్ చరిత్రలో మొదటిసారి ఒక మహిళా ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా, అలాగే సీనియర్ ప్రొఫెసర్‌ను రెక్టర్‌గా నియమించినందుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీలో విద్యార్థులకు అవసరమైన ఆధునిక సదుపాయాలను, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు నూతన అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు తేజావత్ రాహుల్ నాయక్, రూప్ సింగ్ నాయక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ దిశగా కీలక అడుగు..!

**విద్యాశాఖ ఏడీ శంభూ ప్రసాద్‌కు టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) వినతి**

**పాఠశాలలకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 15 (వార్త సంధ్య) :** ప్రజలకు నిరంతరం సమాచారాన్ని చేరవేస్తూ సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. జర్నలిస్టుల పిల్లల విద్యాభ్యాసానికి 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (టీజెఎఫ్) హెచ్-143 యూనియన్ నాయకులు జిల్లా విద్యాశాఖ అదనపు డైరెక్టర్ (ఏడీ) శంభూ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎండి షఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, విపత్తులు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లోనూ విధులు నిర్వర్తించడం వంటి బాధ్యతల మధ్య జర్నలిస్టులు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఫీజులు భారీగా పెరగడంతో జర్నలిస్టుల కుటుంబాలపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ ఏడీ :**

జర్నలిస్టుల వినతిని శ్రద్ధగా విన్న జిల్లా విద్యాశాఖ ఏడీ శంభూ ప్రసాద్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పిల్లల వివరాలను సేకరించి, వారి పేర్ల ఆధారంగా జిల్లాలోని ఆయా పాఠశాలలకు త్వరలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి విద్యాశాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.

**జర్నలిస్టుల్లో హర్షాతిరేకం**

విద్యాశాఖ ఏడీ నుంచి సానుకూల హామీ రావడంతో జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లల విద్యాభ్యాసానికి ఇది ఒక గొప్ప ఊరటనిచ్చే నిర్ణయంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (టీజెఎఫ్) హెచ్-143 జిల్లా సహాయ కార్యదర్శి అచ్చిన ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కాగితపు వెంకటేశ్వర్లు, టెంజు జిల్లా అధ్యక్షుడు వట్టికొండ రవి, ప్రచార కార్యదర్శి కృష్ణంరాజు, ప్రతినిధులు కృష్ణారావు, ప్రవీణ్, శామ్, నరేష్, సూరి, ఫహీమ్, సురేష్, మొగిలి, రాము, షకీల్, రబ్బాని, రాందాస్, లక్ష్మణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో దేరంగుల నారాయణమ్మ బృందం 'భజన కార్యక్రమం ' ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 15 :** తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 76వ రోజు నిర్వహించిన భజన కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. “పాల్కురికి సోమన్న మూల” వేదికపై జూన్ 15, 2026న దేరంగుల నారాయణమ్మ బృందం, భక్తి భజన ' ప్రదర్శన భక్తి భజన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్ సత్కరించి అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.విజయ్ కుమార్ హేమలత సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలతో సభను ఉత్సాహపరిచారు కళాకారులు.

# ఈ పండు చిన్నగా ఉన్నా చేసే మేలు మాత్రం

## చాలా పెద్దది  వైరస్‌లు కూడా దగ్గరికి రావు



ఈ పండ్లలో విటమిన్ సి స్థాయి ఎక్కువగా ఉంటుంది. ఈ విటమిన్ వల్ల తెల్లరక్త కణాలు పెరుగుతాయి. రోగనిరోధక శక్తి బాగా పని చేస్తుంది. దీని వల్ల వైరస్, బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండవచ్చు. లీచీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో కణాలను రక్షిస్తాయి. ఫ్రీ రాడికల్స్ దాడికి గురైన కణాలు బలహీనపడకుండా చూస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీని వల్ల వృద్ధాప్యం ఆలస్యం అవుతుంది. లీచీ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. కడుపు హాయిగా ఉంటుంది. కడుపు నుంచి వెలువడే జ్యూసులు సమతుల్యంగా పని చేస్తాయి. ఫలితంగా జీవక్రియ సరిగా సాగుతుంది. లీచీ పండ్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తాయి. బీపీ స్థాయిని నియంత్రణలో ఉంచుతాయి. గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఈ పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. పోషకాలు మాత్రం ఎక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గే వారు తినేందుకు మంచి ఆప్షన్. ఆకలి అదుపులో ఉంటుంది. శక్తి తగ్గకుండా ఉండేలా చేస్తుంది. లీచీ తినడం వల్ల రక్తప్రసరణ బాగా జరుగుతుంది. ఇందులో కాపర్, ఐరన్ ఎక్కువగా ఉంటాయి. ఈ ఖనిజాలు రక్తం ద్వారా ఆక్సిజన్ సరఫరా చక్కగా జరిగేలా చేస్తాయి. శరీర భాగాలన్నిటికీ రక్తం సరిగ్గా చేరుతుంది. వేసవిలో డీహైడ్రేషన్ సమస్యకు లీచీ మంచి పరిష్కారం. ఇందులో నీరు, ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటి వల్ల శరీరం తేమగా ఉంటుంది. అలసట అనిపించదు. శరీరం ఫ్రెష్‌గా ఉంటుంది. లీచీలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇది చర్మంపై పేరుకున్న మురికిని తొలగిస్తుంది, కాంతిని పెంచుతుంది. అంతేకాకుండా మొటిమలు, ఇతర చర్మ సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయి. లీచీ పండ్లు తినడం వల్ల మన శరీరానికి చాలా మంచి జరుగుతుంది. ఇందులో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు సరైన మోతాదులో ఉంటాయి కాబట్టి వీటిని రోజూ తినడం చాలా మంచిది. తక్కువ క్యాలరీలు ఉండి ఎక్కువ ఆరోగ్యాన్నిచ్చే లీచీ పండ్లను అందరూ తరచుగా తినడానికి ప్రయత్నించాలి.

# ఈ పండు ఒక్కటి తింటే చాలు జబ్బులన్నీ దూరం

## క్షణంలో శక్తి రోజంతా హుషారుగా



సపోటా పండు ఆరోగ్యానికి అనేక లాభాలను ఇస్తుంది. ప్రతిరోజూ ఈ పండును ఆహారంలో చేర్చితే శరీరానికి అవసరమైన శక్తి, పోషకాలు అందుతాయి. జీర్ణక్రియ బాగా జరుగుతుంది. చర్మం, కళ్ళు, ఎముకల ఆరోగ్యం మెరుగవుతుంది. అన్ని వయసులవారు ఈ పండును నిత్యం తీసుకోవచ్చు. సపోటా తీయగా రుచిగా ఉండే పండు. ఇది ఆరోగ్యానికి బాగా ఉపయోగపడుతుంది. రోజు సపోటా తింటే రోగాలు దరిచేరవు. శరీరానికి కావలసిన శక్తిని కూడా ఇస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకూ ఈ పండు తినవచ్చు. సపోటాలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి రక్షణగా పని చేస్తాయి. ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటాయి. సపోటాలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం బాగా జరిగేలా చేస్తుంది. మలబద్ధకం ఉండే వారికి ఇది చాలా మంచిది. అజీర్ణం సమస్యలు తగ్గుతాయి. ఆహారం సరిగ్గా అరిగేలా సహాయపడుతుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి ఎంతో అవసరం. ఇవి సపోటాలో పుష్కలంగా ఉంటాయి. చర్మం తేలికగా కళ తప్పకుండా ఉండటానికి ఇవి ఉపయోగపడతాయి. చర్మం కాంతివంతంగా కనిపించేందుకు సహాయపడతాయి. సపోటాలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును సమతుల్యంగా ఉంచుతుంది. బీపీ ఎక్కువగా ఉండే వారు తినడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది. గుండె ఆరోగ్యం బాగుండటానికి కూడా ఇది సహాయపడుతుంది. ఉదయాన్నే సపోటా తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. పని చేసే శక్తి పెరుగుతుంది. రోజంతా చురుకుగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. అలసట అనిపించకుండా ఉంటుంది. సపోటాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. అధిక బరువు ఉన్నవారికి ఇది అనుకూలంగా పనిచేస్తుంది. తక్కువగా తిన్నా తృప్తిగా అనిపిస్తుంది. ఈ పండులో కాల్షియం, ఫాస్పరస్, ఐరన్ ఉండటం వల్ల ఎముకలకు బలం వస్తుంది. దంతాలు గట్టిగా మారతాయి. శరీర నిర్మాణం బలంగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. వయస్సు పెరిగిన వారికీ ఇది మంచిది. సపోటాలో విటమిన్ ఎ, బీటా కెరోటిన్ బాగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి ఎంతో అవసరం. చూపు బలంగా ఉండేందుకు ఇవి సహాయపడతాయి. కంటి పొడి సమస్యలు తగ్గుతాయి. ఎక్కువగా స్క్రీన్ చూస్తున్న వారికి ఈ పండు మేలు చేస్తుంది.

# వేసవిలో డీలా పడకుండా ఉండాలంటే ఈ డ్రింక్ తప్పకుండా తీసుకోవాల్సిందే



వేసవి వేడిని తట్టుకోవడానికి సహజమైన చల్లదనాన్ని అందించే ఆహారాలు తీసుకోవడం అవసరం. అలాంటి వాటిలో కీరదోసకాయ రసం చాలా ఉపయోగకరమైనది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడమే కాకుండా జీర్ణం, నిద్ర, ఒత్తిడి సమస్యల నుంచి ఉపశమనం ఇస్తుంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఇది ఉపయోగపడుతుంది.

### వేసవిలో డీలా పడకుండా ఉండాలంటే ఈ డ్రింక్ తప్పకుండా తీసుకోవాల్సిందే

వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచే పండ్లు, కూరగాయలూ తీసుకోవడం చాలా ముఖ్యం. అలాంటి వాటిలో కీరదోసకాయ రసం ముఖ్యమైనది. ఈ రసం తాగడం వల్ల శరీరానికి మంచిగా చలువ కలుగుతుంది. వేడి కారణంగా కలిగే అనేక సమస్యలకు ఇది ఉపశమనం ఇస్తుంది. కీరదోసకాయ రసం తీసుకుంటే మన మెదడు చురుకుగా పని చేస్తుంది. మనసు ఏకాగ్రతగా మారుతుంది. జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. చదువు నేర్చుకునే విద్యార్థులు దీనిని తాగితే మంచి ఫలితం పొందగలరు. మొబైల్, టీవీ, పని ఒత్తిడి వల్ల ఆలోచనలు తారుమారవుతున్న ఈ రోజుల్లో ఇది సహాయపడుతుంది. ఈ రసం మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఎప్పుడూ టెన్షన్‌తో ఉండే వ్యక్తులు కీరదోసకాయ రసం తాగితే మానసిక ప్రశాంతత పొందగలరు. ఇది శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది. నిద్ర కూడా బాగా వస్తుంది. రోజూ ఉదయాన్నే తీసుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. కీరదోసకాయ రసంలో ఉండే పీచు, నీరు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. భోజనం తిన్న తర్వాత అజీర్ణం, కడుపు నొప్పి, కాన్స్టిపేషన్ వంటి సమస్యలుంటే దీనిని తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. చిన్నపిల్లలకూ పెద్దలకూ కూడా ఇది ఉపయోగపడుతుంది. ఈ రసం ఎముకల ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఉన్న ఖనిజాలు ఎముకలను బలంగా ఉంచుతాయి. వయస్సు పెరిగేకొద్దీ ఎముకలు బలహీనమవుతుంటే కీరదోసకాయ రసం సహాయపడుతుంది. ఇది ప్రత్యేకంగా మహిళలకు ఉపయోగపడుతుంది. ఈ రసం గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది మంచిది. రక్త ప్రవాహాన్ని సరిచేస్తుంది. గుండెకు మేలు కలిగించే పోషకాలు ఇందులో ఉన్నాయి. ఇది గుండె సంబంధిత రుగ్మతల నివారణకు తోడ్పడుతుంది. కీరదోసకాయ రసం కండరాలకు బలం ఇస్తుంది. వ్యాయామం చేసే వారు దీన్ని తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. శారీరక శ్రమ పెరిగినప్పుడు ఈ రసం తాగితే అలసట తగ్గుతుంది.

# వంట చేయడానికి ఎక్కువ టైమ్ పడుతోందా ఈ కిచెన్ హ్యాక్స్ తెలిస్తే నిమిషాల్లో రెడీ



ఉద్యోగం చేసే ఆడవారికే కాదు ఇంటి పట్టున ఉండే లేడీస్ కూడా ఈ పేరు వింటే కంగారు పడతారు. అదే ఈ రోజు ఏం వంట చేయాలి? అని.. వంట చేయడం అంత సులభం కాదు. అందులోనూ ఇంట్లో కాలేజీలు, ఆఫీసులకు వెళ్లేవారు ఉంటే ఇక ఆ హడావిడి మామూలుగా ఉండదు. మండే వచ్చిందంటే మొదలయ్యే ఈ హంగామా మళ్లీ వారాంతం వరకు ఆడవారిని పరుగులు పెట్టిస్తుంటుంది. అందుకే ఈ టిప్స్ పాటిస్తే మీ వంట సమయం చాలా తేలికగా మారుతుంది... గంటల తరబడి కిచెన్ లో చెమటలు కక్కుతూ వంట చేయడం భారంగా మారుతోందా? అయితే, వంటగదిలో రోజువారీ పనులను సులభతరం చేసేందుకు కొన్ని సృజనాత్మక కిచెన్ హ్యాక్స్ గురించి మీరు తెలుసుకోవాల్సిందే. ఈ హ్యాక్‌లు సాధారణ పద్ధతులతో సమయాన్ని ఆదా చేయడమే కాకుండా వంట చేసే సమయాన్ని సంతోషంగా మార్చుతాయి.

### ఉల్లిపాయలను సులభంగా కట్ చేయడం

ఉల్లిపాయలను కత్తిరించేటప్పుడు కళ్లు మండే సమస్యను తప్పించుకోవడానికి ఒక సులభమైన ఉపాయం ఉంది. ఉల్లిపాయలను కట్ చేయడానికి ముందు వాటిని పది నిమిషాల పాటు ఫ్రీజర్‌లో ఉంచితే, కళ్లలో నీరు రాకుండా సులభంగా కత్తిరించవచ్చు. ఈ ట్రిక్ వంటగదిలో సమయాన్ని ఆదా చేయడమే కాకుండా ఇబ్బందిని తగ్గిస్తుంది.

### టమోటాల తొక్క తీయడం

టమోటాలను సాస్‌లు లేదా కూరల కోసం ఉపయోగించేటప్పుడు తొక్క తీయడం కొంత శ్రమతో కూడుకున్న పని. దీన్ని సులభతరం చేయడానికి, టమోటాలను ముందుగా ముప్పై సెకన్ల పాటు వేడి నీటిలో ముంచి, ఆ తర్వాత చల్లని నీటిలో వేయాలి. ఈ పద్ధతితో తొక్క సులభంగా ఊడిపోతుంది, సమయం మరియు శ్రమ రెండూ ఆదా అవుతాయి.

### వెల్లుల్లి సులభంగా ఒలిచే ఉపాయం

వెల్లుల్లి తొక్క తీయడం చాలా మందికి కష్టమైన పనిగా అనిపిస్తుంది. ఈ సమస్యను అధిగమించడానికి, వెల్లుల్లి గుండ్లను పది నుండి పదిహేను సెకన్ల పాటు మైక్రోవేవ్‌లో ఉంచితే తొక్క సులభంగా వచ్చేస్తుంది. ఈ సులభమైన ట్రిక్ వంటలో వేగాన్ని పెంచుతుంది.

### మసాలాలను తాజాగా ఉంచడం

మసాలా పొడులు ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే వాటిని సరైన రీతిలో నిల్వ చేయడం ముఖ్యం. మసాలాలను గాలి చొరబడని డబ్బాలలో ఉంచి, ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే వాటి సుగంధం మరియు రుచి ఎక్కువ కాలం నిలిచి ఉంటాయి. ఈ హ్యాక్ మీ వంటలకు రుచిని జోడిస్తూ సమయాన్ని ఆదా చేస్తుంది.

### కూరగాయలను వేగంగా ఉడికించడం

కూరగాయలను త్వరగా ఉడికించడానికి, వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసి, వేడి నీటిలో కొద్దిగా ఉప్పు వేసి ఉడికించడం ఉత్తమం. ఈ పద్ధతి వంట సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది మరియు కూరగాయల రుచిని కాపాడుతుంది.

### అరటిపండ్లను తాజాగా ఉంచే ట్రిక్

అరటిపండ్లు త్వరగా పాడవకుండా ఉండాలంటే, వాటి కాడలను ప్లాస్టిక్ ర్యాప్‌తో చుట్టడం ఒక సులభమైన ఉపాయం. ఈ హ్యాక్ అరటిపండ్లను ఎక్కువ రోజులు తాజాగా ఉంచడంలో సహాయపడుతుంది, తద్వారా ఆహార వృథాను తగ్గిస్తుంది.

### గుడ్డును సులభంగా ఒలిచే పద్ధతి

ఉడికించిన గుడ్డును ఒలిచేటప్పుడు పెంకు సులభంగా రావాలంటే, గుడ్డును ఉడికించిన వెంటనే చల్లని నీటిలో వేసి, నీటిలో కొద్దిగా బేకింగ్ సోడా కలపాలి. ఈ పద్ధతి గుడ్డు పెంకును సులభంగా తొలగించడంలో సహాయపడుతుంది, సమయాన్ని ఆదా చేస్తుంది.

# పరిగడపున చెంచా నెయ్యి చేసే అద్భుతం  ఈ వ్యాధులన్నింటికి చెక్



నెయ్యి, భారతీయ వంటకాల్లో ఒక అద్భుతమైన పదార్థం, ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన సూపర్‌ఫుడ్‌గా పిలువబడుతుంది. ఆయుర్వేదం ప్రకారం, ఉదయాన్నే ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగవడం నుండి రోగనిరోధక శక్తి పెరగడం వరకు అనేక లాభాలు ఉన్నాయి. అయితే, ఈ అలవాటు అందరికీ సరిపడకపోవచ్చు. ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను, ఎవరు దీనిని తీసుకోకూడదనే విషయాలను వివరిస్తుంది. ఈ సమాచారం ఆరోగ్యవంతమైన జీవనశైలి కోసం మీకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం జీర్ణవ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. నెయ్యిలోని బ్యూటైరిక్ ఆమ్లం గట్ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది జీర్ణ ఎంజైమ్‌ల స్రావాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఒక చెంచా నెయ్యి తీసుకోవడం వల్ల రోజంతా జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది.

### రోగనిరోధక శక్తిని పెంచడం

నెయ్యిలో విటమిన్లు మరియు ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం వల్ల శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యం పెరుగుతుంది. ఈ అలవాటు సీజనల్ జబ్బులను నివారించడంలో మరియు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది.

### శరీర శక్తిని పెంపొందించడం

నెయ్యిలోని మీడియం-చైన్ ఫ్యాటీ ఆమ్లాలు త్వరగా శక్తిగా మారతాయి. ఉదయాన్నే నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి స్థిరమైన శక్తి లభిస్తుంది, ఇది రోజంతా చురుకుదనాన్ని నిర్వహించడంలో సహాయపడుతుంది. ఇది మెదడు స్పష్టతను మెరుగుపరచడంతో పాటు, అలసటను తగ్గిస్తుంది.

### చర్మం,  జుట్టు ఆరోగ్యం

నెయ్యిలోని యాంటీఆక్సిడెంట్లు మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మాన్ని పోషిస్తాయి, డ్రైనెస్ మరియు వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి. ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం చర్మానికి సహజమైన గ్లోను అందిస్తుంది. అదే విధంగా, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జుట్టు రాలడాన్ని నివారించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది.

### ఎవరు నెయ్యి తీసుకోకూడదు?

ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం అందరికీ సరిపడకపోవచ్చు. గుండె జబ్బులు, అధిక కొలెస్ట్రాల్, లేదా లాక్టోస్ ఇంటాలరెన్స్ ఉన్నవారు నెయ్యిని అతిగా తీసుకోవడం మానుకోవాలి. అలాగే, అధిక బరువు లేదా మధుమేహం ఉన్నవారు నెయ్యిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. ఈ అలవాటును ప్రారంభించే ముందు వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం

# ఏ విటమిన్ తక్కువైనా మీ జుట్టుకు తిప్పలు తప్పవు  బలంగా, ఆరోగ్యంగా ఉండాలంటే ఇవి తీసుకోవాల్సిందే

జుట్టు ఆరోగ్యం కోసం కొన్ని ముఖ్యమైన విటమిన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి శరీరానికి శక్తిని ఇచ్చే ప్రక్రియలతో పాటు జుట్టు కుదుళ్లను బలంగా ఉంచేందుకు కూడా సహాయపడతాయి. ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందాం. పొడిబారిన జుట్టు సమస్యతో బాధపడేవారు జింక్ ఉపయోగాన్ని తప్పనిసరిగా గుర్తించాలి. జుట్టు మృదువుగా మారే ప్రక్రియలో జింక్ కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో జింక్ స్థాయి తక్కువగా ఉంటే జుట్టు బలహీనంగా మారుతుంది. అందుకే జింక్ ఉండే ఆహారాలను నిత్యం తీసుకోవడం మంచిది. విటమిన్ సి లాగే విటమిన్ ఇ కూడా జుట్టుపై ప్రభావాన్ని చూపుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ ను తగ్గించే శక్తి దీనిలో ఉంటుంది. ఇది జుట్టు కుదుళ్లను రక్షిస్తుంది. దెబ్బతిన్న కుదుళ్లు మళ్లీ బలంగా మారేలా చేస్తుంది. దీని వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది. విటమిన్ డి సమృద్ధిగా ఉన్నప్పుడు జుట్టు ఎదుగుదల మెరుగవుతుంది. కొన్ని అధ్యయనాలు కూడా దీన్ని సమర్థించాయి. కొత్త కుదుళ్లు తలపై ఏర్పడేందుకు ఇది సహాయపడుతుంది. రోజూ కొంత సూర్యరశ్మిని తీసుకోవడం ద్వారా శరీరానికి విటమిన్ డి అందుతుంది. జుట్టు పలచబడటం, ఊడటం లాంటి సమస్యలకు విటమిన్ లోపాలే కారణమవుతాయి. అలాంటి లోపాలను సరిదిద్దేందుకు కొన్ని సప్లిమెంట్స్ అవసరం అవుతాయి. వీటిని డాక్టర్ల సూచన మేరకు తీసుకోవడం మంచిది. ఈ సప్లిమెంట్స్ ద్వారా శరీరంలో అవసరమైన విటమిన్స్ సమతుల్యంగా చేరతాయి. జుట్టుకు మేలు చేసే విటమిన్స్ లో విటమిన్ బి7 కూడా ముఖ్యమైనది. ఇది కుదుళ్ల బలాన్ని పెంచుతుంది. జుట్టు ఎదుగుదలలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. బయోటిన్ అనే రూపంలో ఈ విటమిన్ అందుబాటులో ఉంటుంది. ఈ విటమిన్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో ఐరన్ అవసరమైనంతగా పనిచేయాలంటే విటమిన్ సి ఉండాలి. ఐరన్ శోషణకు ఇది తోడ్పడుతుంది. విటమిన్ సి లోపం వల్ల ఐరన్ సమర్థవంతంగా పని చేయకపోవచ్చు. జుట్టు ఎదుగుదలకు ఇది అవసరం. ఫలితంగా జుట్టు ఆరోగ్యం మెరుగవుతుంది. విటమిన్ సి జుట్టు కుదుళ్లను కాపాడుతుంది. బలహీనంగా ఉన్న కుదుళ్లను బలంగా మారుస్తుంది. జుట్టు పాడవకుండా చూసుకుంటుంది. జుట్టు బాగా పెరగాలంటే కుదుళ్లు బలంగా ఉండాలి. కాబట్టి విటమిన్ సి తీసుకోవడం చాలా అవసరం. ఈ విటమిన్లు సరైన మోతాదులో శరీరానికి చేరితే జుట్టు ఆరోగ్యం బాగుంటుంది. ఏ విటమిన్ తక్కువైనా జుట్టు సమస్యలు వస్తాయి. అందుకే డాక్టర్ సలహాతో సరైన ఆహారం తీసుకోవాలి. అప్పుడే జుట్టు బలంగా, పొడిబారకుండా, ఆరోగ్యంగా ఉంటుంది.  ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)





# ఈ పండు ఒక్కటి తింటే చాలు జబ్బులన్నీ దూరం క్షణంలో శక్తి రోజంతా హుషారుగా

# ప్రతి రోజూ బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్ తింటే ఏమవుతుందో తెలుసా  తప్పక తెలుసుకోండి



కాలంలో ఓట్స్ వాడకం బాగా పెరిగింది. చాలా మంది ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్‌ని ఎక్కువగా తింటున్నారు. పైగా పోషకాహార నిపుణులు, వైద్యులు కూడా ఓట్స్ మంచివని చెబుతున్నారు. ఓట్స్‌లో ప్రొటీన్‌లు, కార్బోహైడ్రేట్‌లు, పొటాషియం, ఐరన్, విటమిన్ బీ6, మెగ్నీషియం, కాల్షియం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. అందుకే ఓట్స్‌ని ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్‌గా చాలా మంది ఫాలో అవుతున్నారు. అయితే, మంచివని ఓట్స్‌ని రోజూ తింటున్నారా..? అయితే ఈ విషయాలు తప్పక తెలుసుకోండి.. ఓట్స్ లో ఫాస్ఫరస్, మెగ్నీషియం, ఐరన్, జింక్, ఫోలేట్, విటమిన్ బి 1, విటమిన్ బి 5 వంటి ముఖ్యమైన విటమిన్లు ఉంటాయి. ఓట్స్‌లో ఉండే బీటా-గ్లూకాన్ అనే కరిగే ఫైబర్లు కొలెస్ట్రాల్ స్థాయిలను, ముఖ్యంగా కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతోపాటు మంచి కొలెస్ట్రాల్ ను పెంచి గుండె జబ్బులను తగ్గించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. రోజు ఉదయం పూట ఓట్స్ తినడం వల్ల గుండె సమస్యలు రాకుండా ఉంటాయని వైద్య నిపుణులు అంటున్నారు. ఓట్స్‌లోని కరిగే ఫైబర్లు రక్తంలో గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తాయి. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో సహాయ పడతాయి. డయాబెటిస్ ఉన్నవారికి, డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉన్నవారికి ఇది చాలా మంచిది. ఇది భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నిరోధిస్తుంది. కరిగే, కరగని ఫైబర్లు ఓట్స్‌లో ఉంటాయి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఓట్స్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల కేలరీలు తీసుకోవడం తగ్గుతుంది. తద్వారా బరువు నియంత్రణలో ఉంటుంది. రోజు ఉదయాన్నే అల్పాహారంలో భాగంగా ఓట్స్ తీసుకోవడం వల్ల సులువుగా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. ఓట్స్‌లో సపోనిన్లు అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి చర్మ సమస్యలైన ఎక్జిమా, సోరియాసిస్ వంటి వాటిని దూరం చేస్తాయి

ఓట్స్‌లో ఉండే బీటా-గ్లూకాన్ అనే కరిగే ఫైబర్లు కొలెస్ట్రాల్ స్థాయిలను, ముఖ్యంగా  కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతోపాటు మంచి కొలెస్ట్రాల్ ను పెంచి గుండె జబ్బులను తగ్గించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. రోజు ఉదయం పూట ఓట్స్ తినడం వల్ల గుండె ఇబీవల

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్

**ఈ ఒక్క ఏరియాలోనే ఇల్లు కావాలంటున్న కొనుగోలుదారులు**



భాగ్యనగరంలో స్థిరాస్తి రంగం ఎప్పుడూ ఒక కొత్త మలుపు తీసుకుంటూనే ఉంటుంది. ఒకప్పుడు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ఐటీ కంపెనీల రాకతో ఎలాగైతే ఊహించని రీతిలో అభివృద్ధి చెందాయో.. ఇప్పుడు సరిగ్గా అదే తరహా వృద్ధి ఉత్తర హైదరాబాద్' వైపు కనిపిస్తోంది. రియల్టీ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. రాబోయే కొద్ది ఏళ్లలోనే ఈ ప్రాంతం గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ స్థాయికి చేరుకోనుంది.గతంలో ఐటీ రంగం కేవలం పశ్చిమ హైదరాబాద్‌కే పరిమితమై ఉండేది. అయితే, నగరం నలువైపులా ఐటీని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కండ్లకోయలో భారీ ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తోంది. సుమారు 6 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ పార్క్.. విస్తీర్ణంలో ప్రఖ్యాత సైబర్ టవర్స్ కంటే పెద్దదిగా ఉండబోతోంది. భవిష్యత్తులో ఇక్కడ దాదాపు 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్రాజెక్టు ప్రకటనతోనే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పుంజుకుంది.ఉత్తర హైదరాబాద్ అభివృద్ధికి రవాణా సౌకర్యాలు వెన్నెముకగా నిలుస్తున్నాయి:రహదారులు: హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారి ఈ ప్రాంతం గుండా వెళుతుంది. రద్దీని తగ్గించేందుకు సుచిత్ర నుండి కొంపల్లి వరకు సుమారు 10 కి.మీ మేర మూడు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.రైల్వే & ఎంఎంటీఎస్: ముంబై, షిర్డీ వెళ్లే ప్రధాన రైలు మార్గంతో పాటు బొల్లారం, మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ సదుపాయం ఉండటం ఉద్యోగులకు వరం.ప్రాముఖ్యత: ఇక్కడ జీనోమ్ వ్యాలీ, నల్సార్ వంటి అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు ఇప్పటికే కొలువుదీరాయి. ఇతర హైవేలతో పోలిస్తే ఇక్కడ ట్రాఫిక్ తక్కువగా ఉండటం వల్ల 30 నిమిషాల్లోనే నగరం నడిబొడ్డుకు చేరుకోవచ్చు.హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా.. హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా..అందుబాటులో ధరలు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ప్రస్తుతం ఖరీదైన పెట్టుబడి మార్కెట్లుగా మారాయి. సామాన్యులకు అక్కడ స్థలాలు కొనడం కష్టతరంగా మారింది. దీనికి భిన్నంగా ఉత్తర హైదరాబాద్‌లోని కొంపల్లి, మేడ్చల్ వైపు ధరలు అందుబాటులో ఉన్నాయి.అపార్ట్‌మెంట్లు: చదరపు అడుగుకు రూ.4,500 - రూ.5,000.గేటెడ్ కమ్యూనిటీ: చ.అ.కు రూ.5,500 - రూ.6,000.ఓపెన్ ప్లాట్లు: గజం ధర రూ.60,000 నుండి రూ.80,000 వరకు పలుకుతోంది.హాట్‌స్పాట్‌గా మారుతున్న ప్రాంతాలుప్రస్తుతం జీడిమెట్ల, దూలపల్లి, అల్వాల్, బొల్లారం, కొంపల్లి, కండ్లకోయ, శామీర్‌పేట మరియు మేడ్చల్ వంటి ప్రాంతాలు పెట్టుబడులకు కేంద్ర బిందువులుగా మారాయి. నిజామాబాద్, కామారెడ్డి వంటి ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన వారు కూడా ఇక్కడ భూములను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు ఇప్పటికే ఈ ప్రాంతంలో భారీ విల్లా ప్రాజెక్టులు, ఆకాశహర్మ్యాలను నిర్మించడానికి భూములను సేకరిస్తున్నాయి.ఏదేమైనా అభివృద్ధిని ముందుగానే ఊహించి పెట్టుబడి పెట్టే వారికి ఉత్తర హైదరాబాద్ ఒక బంగారు అవకాశంలా కనిపిస్తోంది. పశ్చిమ హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకే మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన ఇళ్లు లభించే అవకాశం ఉండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# భారత ఫారెక్స్ రిజర్వులను దెబ్బతీసిన ఇరాన్ యుద్ధం

**భారీగా తగ్గిన బంగారం నిల్వలు..**



పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ కేంద్రంగా సాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేస్తోంది. ముడి చమురు, సహజ వాయువు దిగుమతులపై అత్యధికంగా ఆధారపడే భారతదేశంపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. చమురు ధరల పెరుగుదల దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని పెంచడమే కాకుండా.. భారత రూపాయి విలువపై, దేశ విదేశీ మారక నిల్వలపై ఊహించని ఒత్తిడిని తీసుకువచ్చింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కేవలం ఒక్క నెల వ్యవధిలోనే భారతదేశ విదేశీ మారక నిల్వలు 728 బిలియన్ డాలర్ల నుండి 688 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంటే సుమారు 40 బిలియన్ డాలర్ల నిల్వలు హరించుకుపోయాయి. మార్చి 27, 2026తో ముగిసిన వారంలో దేశ మొత్తం నిల్వలు 10.288 బిలియన్ డాలర్లు తగ్గి 688.058 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీనికి ముందు వారంలో కూడా 11.413 బిలియన్ డాలర్ల తగ్గుదల నమోదు కావడం గమనార్హం. ఫిబ్రవరి 27, 2026 నాటికి 728.494 బిలియన్ డాలర్ల సర్వకాలిక గరిష్ఠ స్థాయిలో ఉన్న నిల్వలు.. యుద్ధం కారణంగా వరుసగా రెండు వారాల పాటు భారీ క్షీణతను చూశాయి.నిల్వల తగ్గుదలకు ప్రధాన కారణాలను చూసినట్లయితే.. భారత విదేశీ మారక నిల్వల్లోని వివిధ విభాగాలు ఈ కాలంలో ఒత్తిడికి లోనయ్యాయి. రిజర్వులలో అతిపెద్ద భాగమైన ఎఫ్.సి.ఏ 6.622 బిలియన్ డాలర్లు తగ్గి 551.072 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల వల్ల బంగారు నిల్వల విలువ కూడా వారం వ్యవధిలో 3.666 బిలియన్ డాలర్లు తగ్గి 113.521 బిలియన్ డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో వీటి విలువ సుమారు ₹1.75 లక్షల కోట్లుగా ఉంది.ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడంతో డాలర్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇది రూపాయి విలువను పాతాళానికి నెట్టే ప్రమాదం ఉండటంతో, రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగింది. రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి ఆర్‌బిఐ తన వద్ద ఉన్న డాలర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించింది. ఈ వ్యూహాత్మక జోక్యం వల్లే తగ్గినప్పటికీ, రూపాయి విలువ స్థిరంగా ఉండగలిగింది. ఆర్‌బిఐ తీసుకున్న సత్వర చర్యల వల్ల రూపాయి రికార్డు స్థాయి నుండి తిరిగి కోలుకోవడం విశేషం.భారతదేశం తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల నుంచే పొందుతుంది. యుద్ధం వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే, దిగుమతి బిల్లు పెరిగి కరెంట్ అకౌంట్ లోటు హెచ్చయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మన వద్ద ఉన్న రూ. 65 లక్షల కోట్ల విలువైన విదేశీ మారక నిల్వలు దేశానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తున్నప్పటికీ, యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే ఈ నిల్వలు మరింత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే ఇరాన్ యుద్ధం కారణంగా ఏర్పడిన భౌగోళిక రాజకీయ అనిశ్చితి భారత ఆర్థిక పటిష్టతను పరీక్షిస్తోంది. ఆర్‌బిఐ తన వద్ద ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ రూపాయిని కాపాడుతున్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడితేనే దేశ ఆర్థిక స్థితిగతులు తిరిగి గాడిలో పడే అవకాశం ఉంది.

# బెంగళూరులో తీవ్రమైన ఎల్‌పీజీ సంక్షోభం

**సగం గ్యాస్ స్టేషన్లు మూత..ఆటో డ్రైవర్లు విలవిల**



బెంగళూరు నగరంలో ఆటో ఎల్‌పీజీ సంక్షోభం అత్యంత తీవ్ర స్థాయికి చేరుకుంది. నగరంలోని మొత్తం గ్యాస్ స్టేషన్లలో దాదాపు సగం మూతపడటంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ కొరత శుక్రవారం (ఏప్రిల్ 3, 2026) నాటికి మరింత ముదిరింది. నగరంలోని గ్యాస్ పంపుల వద్ద కిలోమీటర్ల కొద్దీ బారులు తీరిన ఆటో రిక్షాలు ఇప్పుడు సర్వసాధారణ దృశ్యంగా మారాయి.బెంగళూరులోని ప్రైవేట్ గ్యాస్ ఏజెన్సీల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. 'టోటల్ గ్యాస్' తన అన్ని అవుట్‌లెట్‌లను పూర్తిగా మూసివేసింది. ఇక 'సూర్య గ్యాస్', 'సూపర్ గ్యాస్' వంటి స్టేషన్లలో స్టాక్ మధ్యాహ్నం లోపే అయిపోతోంది. ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్థాన్ పెట్రోలియం , భారత్ పెట్రోలియం కేంద్రాల వద్ద కూడా గ్యాస్ కోసం ఆటోలు 3 కిలోమీటర్ల మేర క్యూలో నిలబడుతున్నాయి. అయినప్పటికీ, గంటల తరబడి వేచి చూసిన డ్రైవర్లకు నిరాశే ఎదురవుతోంది. స్టాక్ లేదంటూ సిబ్బంది వారిని వెనక్కి పంపుతున్నారు.ఒక ప్రైవేట్ గ్యాస్ స్టేషన్ మేనేజర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజులుగా వారికి అసలు స్టాక్ అందలేదు. సాధారణంగా రోజుకు నాలుగు టన్నుల గ్యాస్ వచ్చే చోట, గత వారం అది రెండు టన్నులకు పడిపోయి, ఇప్పుడు సున్నాకు చేరింది. గ్యాస్ ధరలు కూడా గతంలో లీటరుకు రూ. 58 ఉండగా.. ఇప్పుడు అవి విపరీతంగా పెరగడం పెట్టుబడిదారులపై అదనపు భారాన్ని మోపుతోంది.భారీగా పెరిగిన ఎల్‌పీజీ సిలిండర్ ధరలు..లబోదిబోమంటున్న వ్యాపారులు..ఎంత పెరిగిందంటే..భారీగా పెరిగిన ఎల్‌పీజీ సిలిండర్ ధరలు..లబోదిబోమంటున్న వ్యాపారులు..ఎంత పెరిగిందంటే..ఈ సంక్షోభం ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీస్తోంది. గ్యాస్ దొరుకుతుందనే ఆశతో తెల్లవారుజామున 5 గంటల నుంచే క్యూలో నిలబడుతున్నామని, కానీ మధ్యాహ్నం వరకు వేచి చూసినా ఫలితం ఉండటం లేదని వారు వాపోతున్నారు. కృష్ణస్వామి అనే డ్రైవర్ మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం నింపుకున్న గ్యాస్‌తోనే నడుపుతున్నానని, ఇప్పుడు అది అయిపోవచ్చినందున ప్రయాణికులను తీసుకెళ్లడానికి భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో డ్రైవర్ శరవణ మాట్లాడుతూ.. గంటల తరబడి వేచి ఉంటే కేవలం 5 లీటర్లు మాత్రమే ఇస్తున్నారని, అది కేవలం 40-50 కిలోమీటర్లకే వస్తుందని చెప్పారు.మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఎల్‌పీజీ సరఫరా గొలుసు దెబ్బతినడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రైవేట్ గ్యాస్ కంపెనీలు ఎక్కువగా దిగుమతులపై ఆధారపడటం వల్ల వాటిపై ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ కొరత వల్ల బెంగళూరు రోడ్లపై ఆటోల సంఖ్య తగ్గిపోయింది, దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది ప్రయాణికులు ఎలక్ట్రిక్ ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, దీవఅశ్విశ్రీబతీబ లో అప్పులు చేసి ఆటోలు కొనుక్కున్న డ్రైవర్లు ఈఎంఐలు , ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని డ్రైవర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జీతం పెరిగినా చేతికి వచ్చే డబ్బు తగ్గుతుందా


**కొత్త టాక్స్ రూల్స్‌లో అసలు ట్విస్ట్ ఇదే!**



సాధారణంగా ఉద్యోగంలో జీతం పెరిగితే ఎవరైనా సంతోషిస్తారు. కానీ మన దేశంలోని కొత్త ఆదాయపు పన్ను విధానం ప్రకారం, కొన్నిసార్లు స్వల్పంగా పెరిగిన జీతం మీ జేబుకు చిల్లు పెట్టవచ్చు. అంటే, మీకు పెరిగిన జీతం కంటే మీరు కట్టే పన్ను ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. దీనినే ట్యాక్స్ పరిభాషలో 'మార్జినల్ రిలీఫ్' సమస్య అంటారు. అసలు ఈ నిబంధన ఏమిటి? పెరిగిన జీతం వల్ల పన్ను భారం పెరగకుండా ఎలా జాగ్రత్త పడాలో ఇప్పుడు చూద్దాం.రెండు వేర్వేరు సందర్భాలు - షాకింగ్ నిజాలుఒక చిన్న ఉదాహరణతో దీనిని అర్థం చేసుకుందాం. కొత్త ట్యాక్స్ విధానంలో రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రిబేట్ లభిస్తుంది.సందర్భం 1: ఒక వ్యక్తి వార్షిక ఆదాయం రూ. 13.40 లక్షలు అనుకుందాం. స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75,000 పోగా, పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ. 12.65 లక్షలు అవుతుంది. దీనిపై లెక్కల ప్రకారం రూ. 69,750 పన్ను పడుతుంది. కానీ ఆదాయం రూ. 12 లక్షల కంటే కేవలం రూ. 65,000 మాత్రమే ఎక్కువగా ఉంది కాబట్టి, ప్రభుత్వం 'మార్జినల్ రిలీఫ్' ఇచ్చి పన్నును రూ. 65,000 కి తగ్గిస్తుంది.సందర్భం 2: ఇప్పుడు అదే వ్యక్తి జీతం రూ. 13.50 లక్షలకు పెరిగింది అనుకుందాం (కేవలం రూ. 10,000 పెంపు). ఇప్పుడు ట్యాక్సబుల్ ఇన్కమ్ రూ. 12.75 లక్షలు అవుతుంది. దీనిపై పన్ను రూ. 71,250 పడుతుంది. ఇక్కడ మార్జినల్ రిలీఫ్ వర్తించదు.అంటే.. కేవలం రూ. 10,000 జీతం పెరగడం వల్ల, ఆ వ్యక్తి అదనంగా రూ. 6,250 పన్ను కట్టాల్సి వస్తోంది. అంటే పెరిగిన జీతంలో 60 శాతం పైగా పన్ను రూపంలోనే పోతుందన్నమాట!మార్జినల్ రిలీఫ్ ఎందుకు ఇస్తారుఒక వ్యక్తి ఆదాయం రూ. 12,00,000 ఉంటే పన్ను సున్నా. అదే రూ. 12,01,000 ఉంటే వేలల్లో పన్ను కట్టాల్సి వస్తే అది అన్యాయం అవుతుంది. అందుకే, పెరిగిన ఆదాయం కంటే పన్ను ఎక్కువగా ఉండకూడదని ప్రభుత్వం ఈ ఉపశమనాన్ని ఇస్తుంది. అయితే, ఇది ఒక నిర్దిష్ట పరిమితి వరకు మాత్రమే పనిచేస్తుంది. ఆ పరిమితి దాటిన వెంటనే పూర్తి పన్ను భారం పడుతుంది.పన్ను భారం తగ్గించుకోవడానికి చిట్కాలుకొత్త లో ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ అదనపు భారం నుంచి తప్పించుకోవచ్చు..స్టాండర్డ్ డిడక్షన్ వాడకం: రూ. 75,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను సరిగ్గా ఉపయోగించుకుని మీ ట్యాక్సబుల్ ఆదాయాన్ని తగ్గించుకోండి.బోనస్ ప్లానింగ్: ఒకవేళ మీ ఆదాయం ట్యాక్స్ కి దగ్గరగా ఉంటే, బోనస్‌లు లేదా ఇతర వేరియబుల్ పేమెంట్లను తదుపరి ఆర్థిక సంవత్సరానికి వాయిదా వేయడం గురించి ఆలోచించండి.పాత వర్సెస్ కొత్త విధానం: మీ పెట్టుబడులు, మినహాయింపులను బట్టి పాత పన్ను విధానం మేలో లేక కొత్తదో ముందే లెక్కించుకోండి.స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్: ఆదాయం పెరిగినప్పుడు వచ్చే పన్ను చిక్కులను నివారించడానికి ట్యాక్స్ సేవింగ్ ఆప్షన్లను సరిగ్గా ఎంచుకోండి.జీతం పెరగడం ఎప్పుడూ శుభపరిణామమే, కానీ ఇలాంటి పన్ను మెలికలు తెలియనప్పుడు అది మనకు తెలియకుండానే ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుంది. కాబట్టి, ట్యాక్స్ ప్లానింగ్ విషయంలో నిపుణుల సలహా తీసుకోవడం ఎప్పుడూ ఉత్తమం.

## జాబ్ పోయినా నాకు టెన్షన్ లేదు! ఎందుకంటే

**బెంగళూరు టెక్కీ వైరల్ పోస్ట్!**



సాధారణంగా ఎవరికైనా ఉద్యోగం పోయిందంటే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. కానీ, బెంగళూరుకు చెందిన ఒక ఐటీ ప్రొఫెషనల్ మాత్రం, "నా ఉద్యోగం పోయింది, నేను చాలా సంతోషంగా ఉన్నాను" అంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా బెంగళూరు వంటి నగరాల్లో ఇల్లు కొనాలా? లేక అద్దెకు ఉండాలా? అనే సందిగ్ధంలో ఉన్నవారికి ఈయన అనుభవం ఒక పెద్ద కనువిప్పుగా మారింది. ఇంతకీ అసలేం జరిగిందంటే..ఈఎంఐ కంటే ఫ్లెక్సిబిలిటీ ముఖ్యం!ఆ టెక్కీ తన రెడ్డిట్ పోస్ట్ లో ఏం చెప్పాడంటే.. "గత ఏడాది నేను బెంగళూరులో ఒక 3 ఇల్లు కొనాలని వెతికాను. నా నెట్ వర్త్ చూసుకుంటే రూ. 2 కోట్ల విలువైన ఇంటిని సులభంగా కొనగలను. కానీ, నేను అప్పుడు మైగ్రేషన్ టీమ్ లో పని చేస్తున్నాను. రాబోయే 2 - 3 ఏళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఐటీ రంగంలో ఎలాంటి మార్పులు వస్తాయో నాకు ముందే తెలుసు. అందుకే ఆఫీస్ నుంచి గంట దూరం ప్రయాణం చేస్తూ భారీ ఈఎంఐలు కట్టడం కంటే, ఆఫీస్ దగ్గర్లోనే అద్దెకు ఉండాలని నిర్ణయించుకున్నాను. సరిగ్గా గత వారం నా ఉద్యోగం ఊడింది. ఇప్పుడు నా తలపై ఈఎంఐ ల భారం లేదు కాబట్టి, ప్రశాంతంగా నా తర్వాతి కెరీర్ గురించి ఆలోచించుకోగలుగుతున్నాను" అని చెప్పుకొచ్చాడు.బెంగళూరు రియల్ ఎస్టేట్ బుడగ పేలుతుందాఈ పోస్ట్ పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. బెంగళూరులో 70-80 శాతం ఇళ్ల కొనుగోలుదారులు ఐటీ ఉద్యోగులే. సర్వీస్ బేస్డ్ కంపెనీల్లో ఉద్యోగ భద్రత తగ్గుతున్న ఈ తరుణంలో, భారీ అప్పులు చేసి ఇల్లు కొనడం ఆత్మహత్యాసదృశ్యమని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఒక యూజర్ అయితే, "గ్లోబల్ యుద్ధాలు, ప్రభావం, మార్కెట్ లో పెరుగుతున్న ఇళ్ల సరఫరా చూస్తుంటే.. ఇప్పుడు కొనడం కంటే మరో రెండేళ్లు వేచి చూడటమే మంచిది" అని కామెంట్ చేశారు. మరికొందరు బిల్డర్లు కావాలనే 'స్టాక్ అయిపోయింది' అని అబద్ధాలు చెబుతూ ధరలను పెంచుతున్నారని ఆరోపించారు.నిపుణులు ఏమంటున్నారుఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నగరాల్లో ఇల్లు కొనేవారు తమ ఆదాయంలో అధిక భాగం ఈఎంఐలకే కేటాయించడం వల్ల ఆర్థికంగా బలహీనపడుతున్నారు. ఉద్యోగం పోవడం లేదా అనారోగ్యం వంటి అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు, భారీ అప్పులు ఉన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని హెచ్చరిస్తున్నారు. బెంగళూరు లోని మౌలిక సదుపాయాలు, నీటి సమస్యలు చూస్తుంటే, కోట్లాది రూపాయలు పెట్టి ఇల్లు కొనడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.మొత్తానికి ఆ టెక్కీ చెప్పినట్లుగా.. భవిష్యత్తు అస్పష్టంగా ఉన్నప్పుడు భారీ ఆర్థిక బాధ్యతలు నెత్తిన వేసుకోకుండా, ప్రశాంతంగా ఉండటమే 'పీస్ ఆఫ్ మైండ్' అనిపిస్తోంది. ఈఎంఐ ల ఉచ్చులో పడకుండా ఉండటమే నేటి కాలంలో అసలైన సక్సెస్ అని ఐటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఫ్లైట్ టికెట్స్ బుక్ చేస్తున్నారా

**సీట్ సెలెక్షన్ రూల్‌పై కేంద్రం సరికొత్త నిర్ణయం!**





విమాన ప్రయాణం చేసే వారికి కేంద్ర ప్రభుత్వం ఒక చేదు వార్త వినిపించింది. కేవలం మూడు వారాల క్రితం ప్రయాణికుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన ఒక కీలక నిబంధనను ఇప్పుడు ప్రభుత్వం అకస్మాత్తుగా రద్దు చేసింది. విమానాల్లో కనీసం 60 శాతం సీట్లను ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా ప్రయాణికులకు కేటాయించాలని గత నెలలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.అసలు ఆ రూల్ ఏమిటి సాధారణంగా మనం ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకున్నప్పుడు, వెబ్ చెక్-ఇన్ సమయంలో నచ్చిన సీటును ఎంచుకోవాలంటే విమానయాన సంస్థలు అదనపు బాదుడు మొదలుపెడతాయి. కిటికీ పక్కన సీటు కావాలన్నా లేదా ముందు వరుసలో కూర్చోవాలన్నా భారీగా వసూలు చేస్తాయి. ప్రస్తుతం కేవలం 5 నుంచి 15 శాతం సీట్లు మాత్రమే ఉచితంగా అందుబాటులో ఉంటున్నాయి. దీనిని అరికట్టడానికి, ప్రతి విమానంలో 60 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని మార్చి 17న ప్రభుత్వం ఆదేశించింది. దీనివల్ల సామాన్య ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గుతుందని అందరూ భావించారు.వెనక్కి తగ్గడానికి కారణాలేంటిఈ నిబంధనను విమానయాన సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్ వంటి సంస్థలు ఉన్న 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్' , ఆకాశ ఎయిర్ ప్రభుత్వానికి లేఖలు రాశాయి. సీట్ సెలెక్షన్ ఫీజును రద్దు చేస్తే, ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి బేస్ ఫ్లైట్ టికెట్ ధరలను పెంచాల్సి వస్తుందని వారు వాదించారు. విమాన ఇంధన ధరలు పెరగడం, అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల విమాన రంగం ఇప్పటికే ఇబ్బందుల్లో ఉందని, ఇలాంటి నిర్ణయాలు మరింత భారం వేస్తాయని వారు వివరించారు. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం, ప్రస్తుతానికి ఈ ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్లు స్పష్టం చేసింది.ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశాలుఅయితే, 60 శాతం ఉచిత సీట్ల నిబంధనను రద్దు చేసినప్పటికీ, మార్చి 17 నాటి సర్క్యులర్‌లోని ఇతర అంశాలను మాత్రం ప్రభుత్వం కొనసాగిస్తోంది.కలిసి ప్రయాణించే వారికి ప్రాధాన్యత: ఒకే టికెట్ పై బుక్ చేసుకున్న కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు వీలైనంత వరకు పక్కపక్క సీట్లు కేటాయించాలని ఆదేశించింది.పారదర్శకత: క్రీడా సామాగ్రి, సంగీత పరికరాలు , పెంపుడు జంతువులను తీసుకెళ్లే విషయంలో స్పష్టమైన పాలసీలు ఉండాలని స్పష్టం చేసింది.ఛార్జీల వెల్లడి: సీట్ల కోసం వసూలు చేసే అదనపు ఛార్జీల వివరాలను బుకింగ్ సమయంలోనే స్పష్టంగా చూపాలని డిజిసిఏ ను కోరింది.మొత్తానికి విమాన ప్రయాణం చౌకగా మారుతుందని ఆశించిన సామాన్యులకు ఈ నిర్ణయం నిరాశ కలిగించే విషయమే. అయితే విమాన సంస్థల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది.


RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు





## అందం అభినయం ఉన్న అవకాశాలు మాత్రం లేవు..

అందం, అభినయం ఉండి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న భామల్లో రెజీనా కాసాండ్రా ఒకరు. తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో నటించిన ఈ అమ్మడు ఇప్పటికీ సారైనా అవకాశం కోసం ఎదురుచూస్తుంది. తెలుగులో నటించిన శివ మనసులో శృతి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. అందం, అభినయం ఉండి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న భామల్లో రెజీనా కాసాండ్రా ఒకరు. తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో నటించిన ఈ అమ్మడు ఇప్పటికీ సారైనా అవకాశం కోసం ఎదురుచూస్తుంది. తెలుగులో నటించిన శివ మనసులో శృతి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది జీనా కాసాండ్రా. శివ మనసులో శృతి సినిమా తర్వాత రొటీన్ లవ్ స్టోరీ , కొత్త జంట సినిమాల్లో నటించిన పాత్రల ద్వారా గుర్తింపు పొందింది. తెలుగులో చివరిగా ఉత్సవం అనే సినిమాలో నటించింది ఆ తర్వాత పెద్దగా ఎక్కడా కనిపించలేదు. రెజీనా కసాండ్రా.. ఈ అమ్మడి గురించి ప్రత్యేకంగాపరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అందాల భామ తన గ్లామర్ తో పాటు నటన పరంగానూ మెప్పిస్తుంది. తాజాగా రెజీనా కసాండ్రా ముస్లిం కుటుంబంలో పుట్టి క్రైస్తవ మతాన్ని స్వీకరించడానికి గల కారణాన్ని వెల్లడించింది. నటి రెజీనా కసాండ్రా 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. 9 సంవత్సరాల వయస్సులో, ఆమె పిల్లల టీవీ ఛానెల్ లో యాంకర్‌గా తన కెరీర్ ప్రారంభించింది. ఆమె ముద్దుముద్దు మాటలు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. తెలుగుతోపాటు తమిళ్ తోపాటు కన్నడ భాషలోనూ సినిమాలు చేసింది. అలాగే బాలీవుడ్ లోనూ నటించింది ఈ బ్యూటీ. హీరోయిన్ గానే కాదు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆచార్య సినిమాలో స్పెషల్ సాంగ్ లో కనిపించింది. కాగా రెజీనా సినిమాల్లోకి రాక ముందు చిన్న వయసులోనే ఓ పిల్లల టీవీ ఛానల్ లో యాంకర్ గా చేసింది. 14 సంవత్సరాల వయస్సులో రెజీనా కసాండ్రా ప్రసన్న, లైలా జంటగా నటించిన తమిళ చిత్రం 'కంద నాన్ మూ'లో లైలా చెల్లెలుగా నటించింది. ఆతర్వాత హీరోయిన్ గా మెప్పించింది. ప్రస్తుతం హిందీలో జెట్ అనే సినిమా చేస్తుంది రెజీనా. వరుసగా సినిమాలు చేసినప్పటికీ ఈబ్యూటీకి అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది.




## బలమైన సందేశంతో 'అభయ'.. 4 భాషల్లో రిలీజ్!

యోగిత భోసాలె ప్రధాన పాత్రలో రూపొందుతోన్న మహిళా సాధికారిక చిత్రం 'అభయ'. ఎన్ఎస్ఇ లిస్టింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ గ్రాడియెంటే ఇన్వోటైన్‌మెంట్ లిమిటెడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాత డా. విమల్ రాజ్ మాథుర్, ఆర్.డి.జి ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన శ్రీ రూపేష్ డి. గోహిల్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు యూసఫ్ ముజామ్మిల్ సుర్తి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ భాషల్లో రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. పోస్టర్ చూస్తుంటే మహిళా సాధికారితపై రూపొందుతోన్న పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ ఇదని అర్థమవుతోంది. ఈ సందర్భంగా గ్రాండియెంటె ఇన్వోటైన్‌మెంట్ లిమిటెడ్ అధినేత, నిర్మాత డా.విమల్ రాజ్ మాథుర్ మాట్లాడుతూ "'అభయ' కేవలం సినిమా మాత్రమే కాదు..సమాజానికి బలమైన సందేశం. ఈ మూవీ ద్వారా తరతరాలుగా ఎందరికో ప్రేరణగా నిలుస్తోన్న మహిళల శక్తి, పట్టుదలను సెలబ్రేట్ చేసుకోబోతున్నాం. సినిమా నాలుగు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ రోజు పోస్టర్‌ను విడుదల చేయటం ఆనందంగా ఉంది. సినిమాకు సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తాం" అన్నారు. ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, నిర్మాత శ్రీ రూపేష్ డి. గోహిల్ మాట్లాడుతూ "'అభయ' టైటిల్ పోస్టర్‌ను విడుదల చేయటం ఆనందంగా ఉంది. ఈ మూవీ ఒక అర్థవంతమైన సందేశాన్ని అందించడమే కాకుండా, బలమైన కథనం, అద్భుతమైన నటీనటులతో రూపొందింది. ఈ ప్రేరణాత్మక సినిమాటిక్ అనుభవాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రావటానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఈ చిత్రంలో యోగిత భోసాలె ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ సినిమాలో ఇంకా మోహన్ జోషి, గణేష్ యాదవ్, కమలేష్ సావంత్, అనికేత్ కేల్‌కర్, రోహిత్ కోకటి, ఉమేష్ బోల్కె, డా.సంజీవ్ కుమార్ పాటిల్, హర్ష్ నికమ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## ప్రభాస్‌తో బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ భారీ ప్లాన్ .. ఫ్యాన్స్‌లో అంచనాలు పెంచుతున్న క్రేజీ కాంబో!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత బిజీ హీరోగా కొనసాగుతున్నారు. 'బాహుబలి'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రెబల్ స్టార్, 'సలార్', 'కల్కి 2898 ాూణ' వంటి భారీ చిత్రాలతో తన మార్కెట్‌ను మరింత విస్తరించారు. ఇలాంటి సమయంలో ప్రభాస్‌కు సంబంధించిన ఓ కొత్త వార్త ఫిలింనగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్‌లో వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ఆదిత్య ధర్, ప్రభాస్‌తో ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రాథమిక స్థాయి చర్చలు కూడా జరిగినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినా, ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారీ యాక్షన్, దేశభక్తి నేపథ్య కథలు, ఎమోషనల్ డ్రామాలను అద్భుతంగా తెరకెక్కించడంలో ఆదిత్య ధర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరోవైపు ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, పాన్ ఇండియా ఇమేజ్‌కు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తే అది కేవలం ఇండియాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు సృష్టించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రభాస్‌ను ఒక కొత్త యాక్షన్ అవతార్‌లో ఆదిత్య ధర్ చూపిస్తే బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు నమోదయ్యే అవకాశముందని చర్చ జరుగుతోంది. అయితే ఈ క్రేజీ కాంబో వెంటనే పట్టాలెక్కే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఇప్పటికే పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న 'ఫౌజీ' చిత్రంలో ప్రభాస్ నటిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్-లవ్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా కనిపించనున్నారు.అలాగే దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' కూడా ప్రభాస్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా భావిస్తున్నారు. మరోవైపు 'కల్కి 2898 ాూణ' సీక్వెల్, 'సలార్ 2' చిత్రాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. దీంతో ప్రభాస్ షెడ్యూల్ వచ్చే రెండేళ్ల వరకు పూర్తిగా బిజీగా ఉండే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

## అవకాశాలు ఫుల్లు హిట్లు మాత్రం నిల్లు.. సాలిడ్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల

అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందణ సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందణ సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది శ్రీలీల.
ఈ మూవీ తర్వాత తెలుగులో శ్రీలీలకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ధమాకా సినిమా తర్వాత అనేక ప్రాజెక్ట్స్ చేసినప్పటికీ ఆ స్థాయిలో హిట్టు మాత్రం రాలేదు. కానీ వరుసగా ఆఫర్స్ మాత్రం అందుకుంటుంది. అందం, అభినయంతోపాటు ఎనర్జీటిక్ డ్యాన్స్ తో ఆకట్టుకుంది. దీంతో తెలుగులో వరుస అవకాశాలు అందిపుచ్చుకుంది. ఓవైపు స్టార్ హీరోలకు జోడిగా నటిస్తూనే.. మరోవైపు కుర్రహీరోలస సరసన నటించింది. అయితే కొన్నాళ్లుగా ఈ బ్యూటీ నటించిన చిత్రాలు తెలుగులో ప్లాప్ అవుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ బ్యూటీ సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. అయితే వరుసగా ప్లాపులు వస్తున్నప్పటికీ శ్రీలీల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఇటీవలే పరాశక్తి సినిమాతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. శివకార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. దాంతో ఈ అమ్మడికి తెలుగులో ఆఫర్స్ తగ్గాయి. ప్రస్తుతం శ్రీలీల అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంది. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది శ్రీలీల. ఈ చిన్నదాని ఫోటోలకు ఫిదా అవుతున్నారు కుర్రకారు.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.